UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక జనం కోసం..

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 42 | పేజీలు : 8 | మంగళవారం 10 మార్చి 2026 | వెల : 4/-

## భారత్ 2.. స్కాట్లాండ్ 2

హైదరాబాద్



మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో సోమవారం స్కాట్లాండ్‌తో మ్యాచ్ (పూల్–బి)ను భారత్ 2–2తో డ్రాగా ముగించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (18వ), సునెలిటా తొపో (29వ) చెరో గోల్ కొట్టారు. స్కాట్లాండ్ జట్టులో హెథర్ మెక్‌ఎవాన్ (6వ), ఫియోనా బర్నెట్ (33వ) స్కోర్ చేశారు. చెరో రెండు గోల్స్ కొట్టాక.. జట్లు ఆధిక్యం కోసం గట్టిగా ప్రయత్నించాయి.

# శాంతిభద్రతలతోనే ప్రగతి

- కొత్త సవాళ్లకు పోలీసులు సిద్ధంగా ఉండాలి
- పనితీరు ఆధారంగా ఎ, బి, సిలుగా వర్గీకరణ
- రీట్రీట్–2026లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాలు, దేశాలే ప్రగతి బాట పడతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి
- సైబర్ నేరాలు, డ్రగ్స్ రూపంలో వస్తున్న కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

3



హైదరాబాద్

శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీలో రెండు రోజులపాటు 'ఫ్యూచర్‌రెడీ పోలీసింగ్' పేరుతో 'రీట్రీట్–2026' నిర్వహించారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాలు, దేశాలే ప్రగతి బాట పడతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సైబర్ నేరాలు, డ్రగ్స్ రూపంలో వస్తున్న కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. పైరవీలకు తావు లేకుండా.. పనితీరు ప్రాతిపదికన పోలీసు అధికారులను ఇప్పటికే ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి... రూపొందించిన జాబితా నా వద్ద ఉంది. దాని ఆధారంగానే బదిలీలు చేస్తున్నాం. ఒక పాలసీ అంటూ లేకపోతే.. పరిపాలనపరమైన స్తబ్దత వస్తుంది. అందుకే రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్–2047' అనే పాలసీకి రూపకల్పన చేశాం. దేశం వందేళ్ల స్వాతంత్ర్య సంబరాలు నిర్వహించుకునే నాటికి మన రాష్ట్రాన్ని ప్రపంచానికి తలమానికంగా నిలపడమే దీని ఉద్దేశం. ముందుచూపు లేకపోవడంతోనే ప్రస్తుతం దేశంలోని మెట్రో నగరాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అందుకే - మిగతా 2లో



## మనోళ్ల భద్రతే ముఖ్యం

- పశ్చిమాసియా కల్లోలంపై కేంద్రం
- మన ఇంధన భద్రతపై రాజీ లేదు
- పార్లమెంటులో జైశంకర్ ప్రకటన
- సంక్షోభానికి చర్చలే పరిష్కారం
- ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికాకు విదేశాంగ మంత్రి సూచన

3



## చర్చకు రాని అవిశ్వాసం

- లోక్‌సభలో మళ్లీ అవే దృశ్యాలు
- తొలి రోజే విపక్షాల నిరసనలు
- పశ్చిమాసియాపై చర్చకు పట్టు
- నేటికి వాయిదా పడ్డ సభ

# 'చమురు' మంటలు



- రిఫైనరీలు, హర్మూజ్ జల సంధిపై దాడులతో నిలిచిన సరఫరా
- ఒక్క రోజే 30 డాలర్లకుపైగా పెరిగిన ముడి చమురు ధర
- ప్రపంచ దేశాలు ఉక్కిరిబిక్కిరి
- ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయనే ఆందోళనలు
- సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఎన్నిక.. ఆ వెంటనే దాడులను తీవ్రం చేసిన ఇరాన్
- గల్ఫ్ దేశాలపై డ్రోన్లు, క్షిపణుల వర్షం
- తుర్కియేపైనా దాడి

3



## మూసీ మెరిసేలా... బాపూ మురిసేలా!

- నదిలో ఏడాదంతా మంచినీటి ప్రవాహం
- బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం
- డీపీఆర్‌ను సిద్ధం చేసిన ఎంఆర్‌డీసీఎల్
- 13న అన్ని రంగాల ముఖ్యులతో సీఎం సమావేశం

హైదరాబాద్

నిరంతరం మంచినీటి ప్రవాహం, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర వాతావరణానికి మూసీ చిరునామాగా మారబోతోంది. పక్షుల కిలకిలారావాలు, పడవల కోలాహలం, చిన్నారుల ఆటపాటలతో నదీ పరీవాహక ప్రాంతం కొంగొత్త రూపాన్ని సంతరించుకోనుంది. నదికి ఇరువైపులా విశాలమైన - మిగతా 2లో

# సన్' డే ఒకలా.. మండే మరోలా..

- ఉష్ణోగ్రతల్లో భారీగా హెచ్చుతగ్గులు..
- వాతావరణంలో వేగంగా మార్పులు
- వారం తర్వాత వడగండ్ల వర్షాలకు అవకాశం..
- క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గి.. నెలాఖరులో పెరుగుదల
- గత మూడు రోజుల ఉష్ణోగ్రతల నమోదు చూస్తే గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు కనిపిస్తున్నాయి.
- రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసంతో నమోదు కావడం గత ఆరేళ్లలో ఇదే తొలిసారి



హైదరాబాద్

రాష్ట్రంలో ఉష్ణోగ్రతల నమోదులో భారీ హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో ఒకరోజు అధికంగా, మరో రోజు సాధారణ స్థితి నుంచి అంతకంటే తక్కువగా నమోదవుతున్నాయి. వేసవి సీజన్ ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుంటాయి. కానీ ప్రస్తుతం ఒకేసారి సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీలు పెరగడం... మరుసటి రోజు సాధారణం కంటే తక్కువగా నమోదు కావడం గమనార్హం. గత మూడు రోజుల ఉష్ణోగ్రతల నమోదు చూస్తే గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు కనిపిస్తున్నాయి. శనివారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా... చాలా ప్రాంతాల్లో కూడా - మిగతా 2లో

## కేజ్రీవాల్, సిసోదియా, కవితలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- ఢిల్లీ మద్యం కేసు విచారణ ఈ నెల 16కి వాయిదా
- సాక్ష్యాధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్న సీబీఐ



3

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం
10 మార్చి 2026

# మూసీ మెరిసేలా... బాపూ మురిసేలా!

-మొదటిపేజీ తరువాయి

రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు, ఆకాశహర్మ్యాలు రాబోతున్నాయి. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మొత్తంగా మూసీ నది హైదరాబాద్‌కు మణిహారం కాబోతోంది. ఈ మేరకు ఎంఆర్‌డీసీఎల్(మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) డీపీఆర్‌ను సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో మూసీ పునరుజ్జీవంపై పర్యావరణవేత్తలు, వివిధ దేశాల రాయబారులు, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజాప్రతినిధులు, మూసీ పరీవాహక ప్రజలు, ఇతర ముఖ్యులతో ఈ నెల 13న సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం జరగనుంది. అందులో ప్రాజెక్టు పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.



**అచ్చెరువొందేలా త్రివేణి సంగమం**

హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9 కి.మీ. పొడవున ఈసీ, గండిపేట నుంచి బాపూఘాట్ వరకు 11 కి.మీ. పొడవున మూసీ ప్రవహించి బాపూఘాట్ వద్ద కలుస్తాయి. వీటిలో గోదావరి నీటిని కలిపి త్రివేణి సంగమంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పం. అందులో భాగంగా ఈ 20 కి.మీ. పొడవున నదులను, వాటి పరీవాహక ప్రాంతాలను, బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్‌ను రూ.5,812 కోట్లతో అభివృద్ధి చేయాలన్నది ప్రణాళిక.

హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు చేపట్టే పనులను జోన్–1గా పేర్కొని, అభివృద్ధికి రూ.1,684 కోట్ల అంచనా వ్యయాన్ని ఎంఆర్‌డీసీఎల్ ప్రతిపాదించింది.

గండిపేట నుంచి గాంధీసరోవర్ వరకు పనులను జోన్–2గా పేర్కొని, దీనికి రూ.1,992 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రతిపాదించింది.

**వంతెనలు... యాంఫీ థియేటర్లు**

నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటు నదికి ఇరువైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు, కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతరత్రా సౌకర్యాలు రానున్నాయి. నదిలో పూడిక తొలగించి, అంచులను చదును చేసి, కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. హోటళ్లు, పిల్లల పార్కులు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం ఉంటుంది.

**రూ.400 కోట్లతో గాంధీ సరోవర్**

బాపూఘాట్ వద్ద 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడే 34 ఎకరాల పర్యాటకశాఖ భూమిలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, కార్యాలయాలు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35–50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటవుతుంది. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపిస్తుంది. పక్కనున్న 98 ఎకరాల రక్షణ శాఖ భూములను సేకరించే ప్రక్రియ పురోగతిలో ఉంది.

**ఏడాదికి 2.5 టీఎంసీలు..**

కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను హైదరాబాద్‌కు ఏడాదికి ఐదు టీఎంసీల చొప్పున తరలించే ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయి. వీటిలో రెండున్నర టీఎంసీలను తాగునీటికి వాడతారు మిగిలిన సగం నీటిని మూసీలో ప్రవాహానికి ఉపయోగిస్తారు.

# వంట నూనెలు సలసల!

హైదరాబాద్

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం సెగ సామాన్యుడి ఇంటిని తాకుతోంది. ఇరాన్--ఇజ్రాయెల్-- అమెరికా యుద్ధం మొదలైన తరువాత చోటుచేసుకున్న పరిణామాలతో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచింది. ఈ క్రమంలో నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగిపోయాయి. ప్రధానంగా విదేశాల నుంచి దిగుమతి అయ్యే వంటనూనెలు, పప్పు దినుసు లు, నూనె గింజల ధరలు ఎగబాకాయి. కిరాణా దుకాణం నుంచి క్విక్ కామర్స్ ఆన్‌లైన్ మార్కెట్ల వరకు అన్ని చోట్ల ధరలు పెరిగాయి. వంట నూనెల ధరలు గతవారం రోజుల్లోనే లీటరుకు రూ. 15--25 వరకు పెరిగాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ ఫిబ్రవరి చివరలో హైదరాబాద్‌లో లీటరు రూ.150కి అటు ఇటుగా ఉండగా, ప్రస్తుతం అది రూ.170కి చేరింది. వేరుశనగ నూనె కూడా రూ. 180కి పైనే పలుకుతోంది. ఇక సామాన్యులకు అందుబాటులో ఉండే పామాయిల్ ధర లీటరుకు రూ.15 నుంచి రూ. 20 మేర పెరిగింది. మార్కెట్‌లో నిల్వలు ఉన్నప్పటికీ, ధరలు ఇంకా పెరుగుతాయనే సాకుతో కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టి మరీ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బేగంబజార్, సికింద్రాబాద్ వంటి హోల్‌సేల్ మార్కెట్లలో కూడా హోల్‌సేల్ వ్యాపారులు నూనె ధరలను పెంచి విక్రయిస్తున్నారు. దాంతో రిటైల్ వ్యాపారులు కూడా ధరలను పెంచడంతో ఆ భారం సామాన్యుడిపై పడుతోంది.




**పెరిగిన పప్పుల ధరలు**

గల్ఫ్ దేశాల నుంచి రావలసిన పప్పు దినుసుల నౌకలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు జరుగుతున్న ప్రచారంతో పప్పు ధాన్యాల ధరలు భారీగా పెరిగాయి. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ. 130--150 మధ్య పలుకుతోంది. వేరుశనగ దిగుబడి తగ్గడం వల్ల వీటి ధరలు కిలో రూ.180 నుంచి రూ.200కి చేరాయి. పెసర పప్పు, మినపప్పు ధరలు కూడా ఎగబాకాయి. ఇజ్రాయెల్--ఇరాన్ ఉద్రిక్తతల వల్ల ఉత్పత్తి దేశాలతోపాటు డిస్ట్రిబ్యూటర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య సప్లై చైన్ లింక్ తెగిపోవడంతో ధరలను పెంచి విక్రయిస్తున్నట్లు వాణిజ్య వర్గాలు చెపుతున్నాయి.

**వంట సామగ్రి ధరలు పెరిగాయ్**

ఏం యుద్ధమో ఏమో. వంట నూనెలతోపాటు పప్పులు, మిర్చి, వేరుశనగ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గ్యాస్ రేట్లు పెంచారు. ఈ ధరలతో హోటల్ నడుపుడు ఎట్లనో తెలుస్తలేదు. ధరలు పెరిగితే మేం కూడా టిఫిన్లు, చపాతి, భోజనాల ధరలు పెంచక తప్పదు. ధరలు పెరగకుండా సర్కార్ ప్రయత్నించాలి.

# సంక్షేమ పథకాలకు రూ.లక్ష కోట్లకు పైనే..!

హైదరాబాద్

కొత్త బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించాలని పలు ప్రభుత్వ శాఖలు ఆర్థికశాఖకు ప్రతిపాదనలు అందజేశాయి. మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల్లోగా మొత్తం 24 శాఖల అధిపతులు, మంత్రులతో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సమీక్ష జరిపి కేటాయింపులపై నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈనెల 20న శాసనసభలో భట్టి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సమావేశాలు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ సమీక్షలన్నీ జనవరిలోనే జరగాల్సి ఉంది. కానీ మున్సిపల్ ఎన్నికల వల్ల వాయిదా పడ్డాయి. ఇప్పుడు బడ్జెట్ తయారీకి ఎక్కువ సమయం లేనందున అరగంటకొకటి చొప్పున మొత్తం 24 శాఖలపై మంగళవారం ఒక్కరోజే ఆర్థికమంత్రి సమీక్షిస్తారని శాఖాధిపతులకు ఆర్థికశాఖ సోమవారం షెడ్యూలు విడుదల చేసింది. గత బడ్జెట్‌లో మాదిరిగానే వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రాధాన్య సంక్షేమ పథకాలు, గ్యారంటీ హామీలు, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ తదితర అభివృద్ధి కార్యక్రమాలకే రూ.లక్ష కోట్లకు పైగా కేటాయించాలని ప్రతిపాదనలు అందినట్లు సమాచారం. కొన్ని పథకాలకు నిధుల వ్యయం పెరుగుతున్నందున అధికంగా కేటాయింపులు జరపాలని సంబంధిత శాఖలు పంపిన ప్రతిపాదనల్లో కోరాయి.

ఈ ఏడాది(2025–26)లో వ్యయానికి, పూర్తిగా, ఇళ్లకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వడానికి రూ.14 వేల కోట్లను రాయితీ పద్దు కింద బడ్జెట్‌లో కేటాయించారు. వచ్చేఏడాది పెండింగులో ఉన్న ట్రూఅప్ ఛార్జీల కింద కలిపి రూ.25 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర ఇంధనశాఖ కోరుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2026–27) తొలిరోజు(ఏప్రిల్ ఒకటి) నుంచే రాష్ట్రంలో మూడో డిస్కం ప్రారంభించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. రాయితీల కింద మూడో డిస్కంకు నిధులు భారీగా అవసరం.



రైతు సంక్షేమ పథకాల కింద వ్యవసాయశాఖకు గత బడ్జెట్‌లో రూ.24,439 కోట్లు కేటాయించినా ప్రస్తుత రబీ సీజన్‌కు ఇస్తామని చెప్పిన రూ.9 వేల కోట్లను ఇంకా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. ఇందులో రాయితీలు 20 వేల కోట్లకు పైగా ఉన్నాయి. ఈసారీ ఇదే స్థాయిలో ఉంటాయని అంచనా. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ బడ్జెట్ గత కేటాయింపుల స్థాయిలోనే కొనసాగిస్తే వచ్చే ఏడాదికి కూడా రూ.24,439 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి. సన్న వడ్లు మద్దతు ధరపై బోనస్ ఇవ్వడానికి భారీగా నిధులు అవసరమని భావిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటివాటికి భారీగా నిధులు అవసరం. వచ్చే ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు అవసరమని అంచనా. గత బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.12,571 కోట్లే కేటాయించినందున వచ్చే ఏడాదికి భారీగా పెంచాల్సిఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## సన్' డే ఒకలా.. మండే మరోలా..

-మొదటిపేజీ తరువాయి

40 డిగ్రీలకు పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కాగా... సోమవారం భద్రాచలం, హనుమకొండ, నల్లగొండ, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఒక డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసంతో నమోదు కావడం గత ఆరేళ్లలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సోమవారం ప్రధాన ప్రాంతాల్లో... గరిష్ఠ ఉష్ణోగ్రత మెదక్‌లో 39 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 16.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

**మూడు రోజులు సాధారణ ఉష్ణోగ్రతలు**

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. బిహార్ నుంచి జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా మరాఠ్వాడ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో దక్షిణ, తూర్పు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు, సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉత్తర ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఒకట్రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.

ఈ నెల 15 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రంలోని పలు చోట్ల తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొన్నిచోట్ల వడగండ్ల వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని సూచిస్తున్నారు. మార్చి చివరి వారం నుంచి ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని, ఏప్రిల్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావొచ్చని హెచ్చరిస్తున్నారు.

## శాంతిభద్రతలతోనే ప్రగతి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణకు ప్రత్యేక పాలసీ రూపొందించాం. సమస్యను పరిష్కరించాలంటే ముందు దాన్ని అర్థం చేసుకొని సమయం కేటాయించాలి. వేగంగా పరిగెత్తితే ఉపయోగం లేకపోగా కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. అందుకే సవాళ్లపై చర్చించేందుకు 'రీట్రీట్–2026' ఏర్పాటు చేయడం అభినందనీయం.

**ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ**

ఈ సదస్సులో వచ్చిన ప్రతిపాదనలకు కార్యరూపం ఇచ్చేందుకు సీఎస్ ఆధ్వర్యంలో డీజీపీ, రవాణా, ఆర్థిక శాఖల కార్యదర్శులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయాలి. సాంకేతిక, న్యాయ, ఆర్థిక సమస్యలపై ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలు చేస్తుంది. ప్రజల ప్రవర్తనలో మార్పు రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ఉపయోగం ఉండదు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా పోలీసుశాఖను క్రమబద్ధీకరించాలి. జనాభాకు తగ్గట్టుగా సిబ్బందిని నియమించుకోవాలి. రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం తగ్గిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ సిబ్బందిని ఇతర అవసరాలకు వినియోగించుకోండి. హైదరాబాద్‌లో పోలీసు, మున్సిపల్ శాఖల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు మూడు కమిషనరేట్లు, మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మిగతా ప్రభుత్వ శాఖలనూ ఇదే పద్ధతిలో సర్దుబాటు చేస్తాం" అని తెలిపారు.

**రెండేళ్లలో అనేక సంస్కరణలు: డీజీపీ**

డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... "రెండేళ్ల కాలంలో పోలీసు శాఖకు సంబంధించి ప్రభుత్వం అనేక సంస్కరణలు తెచ్చింది. అంతకుముందు అనేక మంది ఐపీఎస్ అధికారులు ఏళ్ల తరబడి పోస్టింగులు లేకుండా కార్యాలయానికే పరిమితమయ్యేవారు. ఇప్పుడు ఒక్క అధికారి కూడా ఖాళీగా లేరు. బదిలీలు, పదోన్నతులు సకాలంలో జరిగిపోతున్నాయి. పోలీసు శాఖ పనితీరును మదింపు చేసి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు చేసేందుకు రీట్రీట్ నిర్వహిస్తున్నాం" అని వెల్లడించారు. రవాణా శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్ మాట్లాడుతూ... "రహదారి భద్రతపై పోలీసులతో కలిసి పనిచేస్తాం. వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే విధానాన్ని ఆధునికీకరిస్తున్నాం. రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వబోతున్నాం" అని వివరించారు. కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**బాలలపై జరిగే నేరాల నియంత్రణకు...**

బాలలపై జరిగే నేరాలను నివారించే లక్ష్యంతో యునిసెఫ్‌తో పోలీసు అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు 'చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టం స్ట్రెంగ్తెనింగ్ యూనిట్' ఏర్పాటు చేసి పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా 'లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం' యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

**సరికొత్త పోలీసింగ్‌కు రీట్రీట్-2026 ప్రతిపాదనలు**

రాష్ట్రంలో మారుతున్న నేరాల సరళి, ప్రజలే కేంద్రంగా మరింత సమర్థ పోలీసింగ్‌ను అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందించింది. రీట్రీట్–2026 పేరుతో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎస్పీలు, ఆపై స్థాయి అధికారులంతా హాజరైన ఈ సదస్సులో.. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, మహిళా భద్రత, వ్యవస్థీకృత నేరాలు, ట్రాఫిక్, విపత్తులపై విస్తృతంగా చర్చించారు. ప్రతి అంశంపై డీజీ స్థాయి అధికారి నేతృత్వంలో చర్చలు జరిగాయి.

## ఇంజినీరింగ్ కళాశాలలకు సర్కారు మరో షాక్!

హైదరాబాద్

తెలంగాణలోని ఇంజినీరింగ్‌తో పాటు ఫార్మసీ, లా, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలకు రాష్ట్ర సర్కారు ఊహించని షాక్ ఇచ్చింది. అనేక కళాశాలలకు ఫీజు పెంచకపోవడంతో పాటు కొన్ని కళాశాలలకు ఇప్పటివరకు ఉన్న ఫీజునే తగ్గించిన విషయం తెలిసిందే. కొన్నింటికి దాదాపు సగం ఫీజు తగ్గించారు. ఆ షాక్ నుంచి యాజమాన్యాలు తేరుకోలేదు. అదే సమయంలో ఈసారి ట్యూషన్ ఫీజు తప్ప.. ఇతర పేర్లతో ఒక్క రూపాయి కూడా వసూలు చేయడానికి వీల్లేదని కొత్త ఫీజుల జీఓల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ట్యూషన్ ఫీజుతోపాటు బీటెక్‌కు వివిధ రకాల పేరిట విద్యార్థుల నుంచి అదనంగా రూ.8,500 వసూలు చేసుకునే వీలుండేది. అందులో రూ.2 వేలు కళాశాలలు విశ్వవిద్యాలయాలకు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజుల్లో జీఓలో ప్రత్యేక ఫీజులను కూడా పొందుపరిచేవారు. ఈసారి జీఓల్లో వాటి ప్రస్తావన లేదు. ట్యూషన్ ఫీజులో స్పెషల్ ఫీజు, అడ్మిషన్ ఫీజును చేర్చలేదని, ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్ఆర్‌సీ) కోరినట్లు జీఓలో ఉంది. అయితే విద్యాశాఖ వర్గాలు మాత్రం తమకు టీఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదించిన ఫీజులనే ఖరారు చేశామని, ప్రత్యేక రుసుములను సిఫార్సు చేయలేదని పేర్కొంటున్నాయి. దీనిపై టీఏఎఫ్ఆర్‌సీ వర్గాలు ప్రత్యేక ఫీజులపై ఉన్నతాధికారులతో చర్చించి.. స్పష్టతనిస్తామని వ్యాఖ్యానించాయి.

**అనధికారికంగా రెట్టింపు వసూలు**

అధికారికంగా ఇప్పటివరకు బీటెక్ విద్యార్థుల నుంచి ఆయా కళాశాలలు రూ.8,500 చొప్పున వసూలు చేయవచ్చు. కానీ రకరకాల పేర్లు చెప్పి అనధికారికంగా రూ.12,000–రూ.16,000 వరకు పలు కాలేజీలు వసూలు చేస్తున్నాయి. ఆ ప్రకారం ఏటా కనీసం రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు అదనంగా పొందుతున్నట్లు అంచనా. ఇతర కోర్సులను కూడా కలిపితే రూ.100 కోట్లు దాటతాయి. కొత్త ఫీజులను ఖరారు చేసే ముందు విద్యాశాఖ, టీఏఎఫ్ఆర్‌సీ వర్గాల్లో రకరకాల చర్చలు జరిగాయి. ఈ పరిస్థితుల్లో ట్యూషన్ ఫీజు తప్ప.. మిగిలినవి వద్దని అంతర్గతంగా భావించినట్లు తెలుస్తోంది.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం
10 మార్చి 2026

# మనోళ్ల భద్రతే ముఖ్యం

న్యూఢిల్లీ

పశ్చిమాసియా సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికా తక్షణం ఉద్రిక్తతలకు తెర దించాలని సూచించింది. దేశాల సార్వభౌమాధికారాలను గౌరవించాలని అభిప్రాయపడింది. పశ్చిమాసియా ప్రాంతంలోని దాదాపు కోటి మంది భారతీయుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసింది. దేశ ఇంధన భద్రత, వర్తక, భద్రత ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని పేర్కొంది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సోమవారం పార్లమెంటు ఉభయ సభల్లో ఈ మేరకు ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితిని కేంద్రం నిరంతరం సమీక్షిస్తోందని చెప్పారు. ఇప్పటిదాకా 67 వేల మంది విద్యార్థులను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చినట్టు వివరించారు. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రత నిమిత్తం అక్కడి దేశాధినేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే పలుమార్లు మాట్లాడారని గుర్తు చేశారు. “మన ఇంధన భద్రతపై ఆందోళన అనవసరం. ఈ విషయంలో మన వినియోగదారుల ప్రయోజనాలే పరమావధి. వాటిని కాపాడే దిశగా కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోంది”అని తెలిపారు. “మన ఇంధన భద్రతకు, వర్తకానికి గల్ఫ్ ప్రాంతం కీలకం. ఆ ప్రాంతంతో ఏటా 200 బిలియన్ డాలర్ల మేరకు



వాణిజ్యం జరుగుతోంది”అని గుర్తు చేశారు.

**నౌకలకు ఆశ్రయం కోరిన ఇరాన్**

ఇరాన్‌కు చెందిన నౌక భారత్‌లో ఆశ్రయం పొందేందుకు మానవతా కోణంలో అనుమతించినట్టు జైశంకర్ వెల్లడించారు. “మూడు నౌకలకు ఇరాన్ ఆశ్రయం కోరింది. ఈ మేరకు ఫిబ్రవరి 28న విజ్ఞప్తి చేసింది. కేంద్రం మార్చి 1న అనుమతులు జారీ చేసింది. ఐఆర్ఐఎస్ లావన్ నౌక మాత్రమే మార్చి 4న కొచిలో లంగరు వేసింది”అని చెప్పారు. మిగతా రెండు నౌకల్లో ఐఆర్ఐఎస్ దేనాను మార్చి 4న శ్రీలంక తీరంలో అమెరికా ముంచేయడం తెలిసిందే. అనంతరం మూడో నౌక ఐఆర్ఐఎస్ బుషెర్ శ్రీలంకలోని ట్రింకోమలీ రేవులో లంగరు వేసింది.

**చర్చకు ఖర్గే డిమాండ్**

జైశంకర్ ప్రకటనపై ఉభయ సభల్లోనూ విపక్ష సభ్యులు పెద్దపెట్టున నిరసనలకు దిగారు. ప్రకటనకు ముందే పశ్చిమాసియా సంక్షోభంపై పూర్తిస్థాయి చర్చకు పట్టుబట్టారు. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ దేశ ఇంధన భద్రతపై స్వల్ప అవధి చర్చకు డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధర పెంపు సామాన్యునిపై భారం మోపిందని ఆయన విమర్శించారు. “పశ్చిమాసియా కల్లోలం తాలూకు ప్రభావం భారత ఇంధన భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వంపైనా పడుతోంది. దేశ ఇమేజీని, ప్రతిష్టను కూడా ఆ యుద్ధం ప్రభావితం చేస్తోంది. కనుక ఈ అంశంపై 176వ నిబంధన కింద చర్చ చేపట్టాలి”అని కోరుతూ నోటీసిచ్చారు. దాన్ని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ వెల్లడించారు. అనంతరం జైశంకర్ ప్రకటన చేసేందుకు అనుమతించారు. అందుకు విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ వాకౌట్ చేశారు. మంత్రి ప్రకటన చేస్తుండగానే వాకౌట్ చేయడాన్ని సభా నాయకుడు జె.పి.నడ్డా తీవ్రంగా తప్పుబట్టారు. సభలో అరాచక పరిస్థితులు సృష్టించేందుకు కాంగ్రెస్, విపక్షాలు ప్రయతి?నస్తున్నాయంటూ మండిపడ్డారు.

# ‘చమురు’ మంటలు

దుబాయ్

పశ్చిమాసియా యుద్ధం చమురు మంటలను రేపింది. ప్రపంచ చమురు మార్కెట్లో కల్లోలం సృష్టించింది. భగ్గున మండిన చమురు ధరలతో ప్రపంచ దేశాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. కొన్ని దేశాలు చమురు పంపిణీలో రేషన్ ప్రారంభించగా.. మరికొన్ని ఇంధన ధరలను పెంచేస్తున్నాయి. మరికొన్ని దేశాలు యుద్ధాన్ని ఆపాలని, లేదంటే ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎన్నిక కాగానే చమురు క్షేత్రాలను, రవాణాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తీవ్ర దాడులకు దిగడంతో కలవరం మొదలైంది. ఫలితంగా ఒక్క రోజే ముడి చమురు ధర బ్యారెల్‌కు 30 డాలర్లకుపైగా పెరిగింది. ఇటు ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా–ఇజ్రాయెల్ దాడులను కొనసాగించాయి. చమురు ధరల మంటతో భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా పలు మార్కెట్లు కుప్పకూలాయి.

**మొజ్తాబా ఎన్నికతో కలవరం**

ఇటీవల అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఆయతుల్లా అలీ ఖమేనీ వారసుడిగా సోమవారం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ (56) ఎన్నికయ్యారు. తండ్రి కంటే ఆయన మరింత కఠినంగా వ్యవహరిస్తారని పేరుంది. ఆయనకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో (ఐఆర్‌జీసీ) మరింత బలమైన సంబంధాలున్నాయి. మొజ్తాబా ఎన్నికయ్యారని తెలియగానే ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటాయి. సోమవారం బ్యారెల్ ధర ఒక దశలో 119.5 డాలర్లకు చేరుకుంది. ఇది యుద్ధం ప్రారంభమైనప్పటితో పోలిస్తే 65 శాతం అధికం. చివరకు అది 100 డాలర్లకు తగ్గిపోయింది. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే 9 శాతం పెరుగుదల నమోదైంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొజ్తాబా బయట కనిపించలేదు. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో తండ్రి ఖమేనీతోపాటే మొజ్తాబా భార్య జహ్రా హదద్ ఆదెల్ చనిపోయారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎన్నిక కావడంతో దేశ వ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. అనేక మంది మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కేంద్రాలను గతంలోనే ధ్వంసం చేసినా అణు బాంబుల తయారీపై మొజ్తాబా దృష్టి పెడతారని భావిస్తున్నారు. ఇంకా ఆ దేశం వద్ద శుద్ధి చేసిన యురేనియం ఉంది. ఆయుధాల స్థాయికి శుద్ధి చేసే ప్రక్రియ అడుగు దూరంలోనే ఉంది. ఇప్పుడు మొజ్తాబా ఆ పనిని పూర్తి చేస్తారని భావిస్తున్నారు. సుప్రీం లీడర్‌గా ఎవరు ఎన్నికైనా లక్ష్యంగా చేసుకుంటామని ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రకటించింది. మొజ్తాబాను అంగీకరించబోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. మొజ్తాబా నియామకానికి ఐఆర్‌జీసీతోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపు మద్దతు తెలిపాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ మద్దతు ప్రకటించారు. బేషరతుగా మద్దతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇరాన్ అంతర్గత నిర్ణయాలను గౌరవించాలని ప్రపంచ దేశాలకు చైనా పిలుపునిచ్చింది. తిరిగి చర్చలు కొనసాగించి ఉద్రిక్తతలను తగ్గించాలని సూచించింది. మొజ్తాబా ఎన్నికను ఇరాన్ భద్రతాధికారి అలీ లారీజానీ ప్రశంసించారు. అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.

**ఇస్ఫహాన్‌పై దాడులు**

ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరంపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐఆర్‌జీసీ కమాండ్ కేంద్రాలతోపాటు బసీజ్ వాలంటరీ ఫోర్స్‌ను లక్ష్యంగా చేసుకుంది. రాకెట్ ఇంజిన్ ఉత్పత్తి కేంద్రంపైనా ఇజ్రాయెల్ విరుచుకుపడింది. క్షిపణి ప్రయోగ కేంద్రాన్నీ లక్ష్యంగా చేసుకుంది. టెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ దాడులు చేసింది.

లెబనాన్ రాజధాని బీరుట్ శివారు ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. దీంతో ఆ ప్రాంతాలపై దట్టమైన పొగ అలముకుంది. హెజ్‌బొల్లా ఆర్థిక లక్ష్యాలపై ఈ దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

లెబనాన్‌పై దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లోని 70వేల మంది సిరియన్లు తమ దేశానికి వెళ్లిపోతున్నారు. నిలిచిన చమురు రవాణా హర్మూజ్ జల సంధిపై ఇరాన్ దాడి చేయడంతో చమురు రవాణా ఆగిపోయింది. ఈ జల సంధి మీదుగానే రోజుకు 15 మిలియన్ బ్యారెళ్లు రవాణా అవుతోంది. ప్రస్తుతం సౌదీ అరేబియా, కువైట్, ఇరాక్, ఖతార్, బహ్రెయిన్, యూఏఈ, ఇరాన్‌ల నుంచి చమురు, గ్యాస్ కావాల్సి ఉంది. ఇదంతా ఆగిపోయింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని (యూఏఈ) చమురు కేంద్రంలో మంటలు చెలరేగాయి. రాజధాని అబుధాబీపై 15 బాలిస్టిక్ క్షిపణులను, 18 డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. ఇందులో 12 క్షిపణులను అడ్డుకోగా 3 సముద్రంలో పడిపోయాయి. 17 డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. ఒకటి భూభాగంపై పడింది. డ్రోన్లు, క్షిపణులను అడ్డుకునే విధుల్లో భాగంగా తిరుగుతున్న హెలికాప్టర్ కూలి ఇద్దరు సైనిక సిబ్బంది మరణించారని యూఏఈ సోమవారం వెల్లడించింది. ఇది సాంకేతిక సమస్యేనని డ్రోన్ల కారణంగా కాదని తెలిపింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా యూఏఈపై ఇరాన్ 253 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. 1,440 డ్రోన్లు ఇరాన్ నుంచి దూసుకొచ్చాయి. ఈ దాడుల కారణంగా నలుగురు మరణించారు. 117 మంది గాయపడ్డారు. బహ్రెయిన్‌లోని ఏకైక చమురు కేంద్రంపైనా దాడులు జరిగాయి. సోమవారం బహ్రెయిన్ ప్రభుత్వ చమురు కంపెనీ రవాణాపై నిషేధం విధించింది. షైబా చమురు క్షేత్రంపైకి దూసుకొచ్చిన పలు డ్రోన్లను అడ్డుకున్నామని సౌదీ అరేబియా ప్రకటించింది. చమురు రవాణాను నిషేధించామని, అసాధారణ పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. స్థానిక డిమాండును తీర్చగలమని వెల్లడించింది. ఆదివారం జరిగిన దాడుల్లో ఇద్దరు బంగ్లాదేశీయులు మరణించారు. తొలుత మృతుల్లో భారతీయుడు ఉన్నారని వార్తలొచ్చినా ఆ తర్వాత రెండో వ్యక్తీ బంగ్లాదేశ్ వాసేనని తేలింది. హర్మూజ్‌ను మూసివేయడంతో చమురు ఉత్పత్తిని సౌదీ అరేబియా, యూఏఈ కువైట్, ఇరాక్ తగ్గించాయి. కువైట్, ఖతార్, బహ్రెయిన్‌లపై ఇరాన్ చేసిన దాడుల్లో 32 మంది గాయపడ్డారు. అందులో చిన్నారులున్నారు. ఖతార్ రాజధాని దోహాలో సోమవారం 12 నుంచి 13 పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

**నిజామాబాద్ వాసికి గాయాలు..**

ఇజ్రాయెల్‌పై ఇరాన్ పలుమార్లు డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. దీంతో సోమవారం చాలాసార్లు సైరన్లు మోగాయి. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందారు. ఒక మహిళ గాయపడ్డారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణి శిథిలాలు తగిలి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన తిరుపతి అనే వ్యక్తి గాయపడ్డారు. టెల్ అవీవ్‌లోని ఆసుపత్రిలో అతడు చికిత్స పొందుతున్నారు. తమ దేశ గగనతలంలోకి ప్రవేశించిన బాలిస్టిక్ క్షిపణిని నాటో బలగాలు అడ్డుకున్నాయని తుర్కియే ప్రకటించింది. ఇరాక్‌లోని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ప్రయోగించిన డ్రోన్‌ను గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. ఈ నెల 1న ఇరాన్ జరిపిన దాడిలో గాయపడిన మరో అమెరికా సైనికుడు మరణించారు. దీంతో ఇప్పటిదాకా ఏడుగురు మరణించినట్లయింది. సౌదీ అరేబియాలోని అత్యవసరం కాని దౌత్య సిబ్బంది తమ కుటుంబాలతో కలిసి దేశం వీడాలని సోమవారం అమెరికా విదేశాంగశాఖ హెచ్చరిక జారీ చేసింది. దీంతోపాటు బహ్రెయిన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, లెబనాన్, ఖతార్, యూఏఈ, పాకిస్థాన్‌లోని కరాచీ, తుర్కియేలోని అదానాల్లోని సిబ్బందీ ఖాళీ చేయాలని సూచించింది.

ప్రత్యామ్నాయాలవైపు దేశాల చూపు

ఇరాన్ నుంచి రోజూ చైనా 1.6 మిలియన్ బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటోంది. అందుకే యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండు చేస్తోంది. ఒకవేళ ఇరాన్ రవాణా ఆగిపోతే ప్రత్యామ్నాయాలను చైనా చూసుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా దేశంలో ధరలు పెరిగే ప్రమాదముంది. యుద్ధాన్ని ఆసరాగా చేసుకుని చమురు ధరలను పెంచితే రిఫైనరీలు, గ్యాస్ స్టేషన్లపై భారీ జరిమానాలు విధిస్తామని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ హెచ్చరించారు. గత 30 ఏళ్లలో ఆ దేశంలో ఇలా నియంత్రణ విధించడం ఇదే తొలిసారి. దక్షిణాసియా దేశాల్లోని పెట్రోలు బంకులవద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. చమురు కొరత కారణంగా పాకిస్థాన్ పంజాబ్‌లోని విద్యాలయాలను ఈ నెల 31వ తేదీ వరకూ మూసివేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అమలు చేస్తున్నారు. మంత్రులకు ఇంధన కోటాను ఎత్తివేశారు. ప్రభుత్వ అధికారుల వాహనాలకు 50శాతం ఇంధన అలవెన్సులను తగ్గించారు. పాకిస్థాన్‌లో పెట్రోలు ధరలను 20శాతం పెంచింది. పుణెలో గ్యాస్ ఆధారిత అంత్యక్రియలను నిషేధించారు. కలప, విద్యుత్తు వాడాలని సూచించారు.

**జీ7 దేశాల అత్యవసర భేటీ**

ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, చమురు ధరలు అనూహ్యంగా పెరగడంతో జీ7 దేశాలు సోమవారం అత్యవసరంగా బ్రస్సెల్స్‌లో సమావేశమయ్యాయి. ముడి చమురు ధర ఆకాశాన్నంటడంతో తొలుత తమ వ్యూహాత్మక చమురు నిల్వలను బయటకు తీయాలని జీ7 దేశాలు నిర్ణయించాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. జీ7 సమావేశం తర్వాత తమ నిర్ణయాన్ని మార్చుకున్నామని ప్రకటించారు. చమురు ధరలు 100 డాలర్లకు దిగివచ్చినందున ప్రస్తుతానికి ఆ ప్రతిపాదనను పక్కనబెట్టాలని నిర్ణయించామని వివరించారు.

**సరైన సమయంలో ముగిస్తాం: ట్రంప్**

ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్యలను ఎప్పుడు నిలిపివేయాలన్న అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో చర్చించి నిర్ణయిస్తామని వెల్లడించారు.

**ప్రపంచం అంతం దిశగా యుద్ధం: రష్యా**

ఇరాన్‌పై యుద్ధంతో ప్రపంచం అంతం దిశగా సాగుతోందని రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాలు ఇక ఏ మాత్రం మనలేవని ఈ యుద్ధం నిరూపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌లో భూతల పోరుకు సిద్ధమవుతున్నామని ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో రష్యా స్పందించింది.

**భారతీయులూ.. జాగ్రత్త**

బహ్రెయిన్‌లో ఉంటున్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది. స్థానిక ప్రభుత్వం ఇచ్చిన భద్రతా మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. ‘బహ్రెయిన్‌లోని భారత ఎంబసీతోపాటు అక్కడి ప్రభుత్వం ఇచ్చే అప్‌డేట్లను, సూచనలను అనుసరించాలని భారతీయ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాం’ అని ఎంబసీ తరఫున ప్రకటన విడుదలైంది. బహ్రెయిన్ నుంచి భారత్‌కు రావాలనుకునేవారు సౌదీ అరేబియా మీదుగా రావాల్సిందిగా ఇప్పటికే నిబంధనలు జారీ అయ్యాయి. ఇందుకోసం సౌదీ ప్రభుత్వం ట్రాన్సిట్ వీసాలను జారీ చేస్తోంది.

## చర్చకు రాని అవిశ్వాసం

న్యూఢిల్లీ

పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాల తొలి రోజైన సోమవారం కూడా లోక్‌సభలో పాత దృశ్యాలే పునరావృతమయ్యాయి. విపక్ష సభ్యులు పదేపదే కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటన చేయబోతుండగా అడ్డుకున్నారు. ఆ సంక్షోభంపై పూర్తిస్థాయి చర్చకు పట్టుబట్టారు. తొలి విడత బడ్జెట్ సమావేశాల్లో తాము లేవనెత్తిన పలు ఇతర అంశాలకు సంబంధించి ప్లకార్డులు ప్రదర్శించారు. వాటన్నింటికీ ప్రభుత్వం అప్పుడే వివరంగా బదులిచ్చిందని సభాపతి స్థానంలో ఉన్న జగదంబికా పాల్ గుర్తు చేశారు. పశ్చిమాసియాపై చర్చకు వారిచ్చిన వాయిదా తీర్మానాన్ని స్వీకరించేందుకు నిరాకరించారు. “స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలిచ్చిన అవిశ్వాస తీర్మానం ఇప్పటికే ఈ రోజు ఎజెండాలో ఉంది. ఒకే రోజు రెండు అంశాలపై చర్చ ఎలా సాధ్యం? పశ్చిమాసియాపై చర్చ కావాలంటే సభా వ్యవహారాల కమిటీని సంప్రదించండి”అని సూచించారు. వారు పట్టువీడకపోవడంతో ఆగ్రహించారు. “విపక్ష సభ్యులు పరిణతి లేకుండా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారు. రాజకీయ ఎజెండా ప్రకారం వ్యవహరిస్తున్నారు”అంటూ మందలించారు. వారు సభా మర్యాద పాటించడం లేదంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆక్షేపించారు. అయినా సభ్యులు శాంతించకపోవడంతో సభ పదేపదే వాయిదా పడింది. మధ్యాహ్నం మూడింటికి సమావేశమయ్యాక కూడా అవే పరిస్థితులు కొనసాగాయి. బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు చేపడదామని విపక్ష సభ్యులకు పాల్ విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది. దాంతో ఆ అంశాన్ని చర్చకు చేపట్టకుండానే సభ మంగళవారానికి వాయిదా పడింది.

**పశ్చిమాసియాపై చర్చ ఉండబోదు: కేంద్రం**

పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చ చేపట్టాలన్న విపక్షాల డిమాండ్లకు కేంద్రం అంగీకరించే అవకాశం లేదని సమాచారం. దీనిపై విదేశాంగ మంత్రి ఉభయ సభల్లో ఇప్పటికే ప్రకటన చేసినందున ఇక చర్చ అనవసరమని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

**మోదీ బండారం బయటపడుతుందనే!**

పశ్చిమాసియా కల్లోలంపై పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు విపక్షాలు డిమాండ్ చేశాయి. ఉభయ సభల్లో విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటన అనంతరం పార్లమెంట్ మకరద్వారం వద్ద విపక్ష ఎంపీలు ధర్నాకు దిగారు. ఈ సంక్షోభానికి సంబంధించిన కీలకాంశాలపై మోదీ సర్కారు మౌనం పాటిస్తోందని ఆరోపించారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ కేంద్రానికి, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ , తృణముల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమాసియా విషయంలో అమెరికా బ్లాక్‌మెయిలింగ్‌కు మోదీ లొంగిపోయారని రాహుల్ ఆరోపించారు. “ఈ అంశంపై పార్లమెంటులో చర్చ చేపడితే అవన్నీ బయటపడతాయని కేంద్రం భయపడుతోంది. అందుకే చర్చకు వెనకాడుతోంది”అని ఆరోపించారు.

**‘అవిశ్వాసం’పై నేడు చర్చ?**

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని సభ మంగళవారం చర్చకు చేపట్టే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తదితరులు చర్చలో పాల్గొంటారు. అనంతరం చర్చకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా బదులిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తీర్మానాన్ని వీలైనంత త్వరగా చర్చకు చేపట్టాలని కేంద్రం భావిస్తున్నట్టు వెల్లడించాయి. స్పీకర్ వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ 118 మంది విపక్ష ఎంపీలు తొలి విడత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసివ్వడం తెలిసిందే. నాటినుంచీ లోక్‌సభ సమావేశాలకు బిర్లా సారథ్యం వహించడం లేదు. అవిశ్వాస తీర్మానంపై సభ నిర్ణయం వెలువడేదాకా స్పీకర్ విధులకు దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నారు. మంగళవారం ఆయన సాధారణ ఎంపీగా చర్చలో పాల్గొనే అవకాశముందని లోక్‌సభ వర్గాలు తెలిపాయి. గతంలో మూడుసార్లు స్పీకర్లపై అవిశ్వాస తీర్మానాలిచ్చినా ఒక్కటి కూడా నెగ్గలేదు.

## కేజ్రీవాల్, సిసోదియా, కవితలకు దిల్లీ హైకోర్టు నోటీసులు

దిల్లీ

దిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవితతోపాటు ప్రతివాదులందరికీ దిల్లీ హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సరైన ఆధారాలు లేవంటూ దిల్లీలోని రౌజ్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 23 మంది నిందితులకు విముక్తి కల్పిస్తూ ఫిబ్రవరి 27న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దర్యాప్తు సంస్థ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై దిల్లీ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ కేసు దర్యాప్తు జరిపిన సీబీఐ అధికారులపై శాఖాపరమైన విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ట్రయల్‌కోర్టు న్యాయమూర్తి జితేంద్ర ప్రతాప్‌సింగ్ జారీచేసిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా చేసిన వాదనలను పరిశీలించిన అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంతశర్మ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. “ప్రతివాదులకు వ్యతిరేకంగా సమర్పించిన సాక్ష్యాధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. దర్యాప్తు సంస్థకు వ్యతిరేకంగా ట్రయల్‌కోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదని పేర్కొన్నారు. సీబీఐ కేసులో నిందితులందర్నీ డిశ్చార్జి చేస్తూ ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో దీంతో ముడిపడిన మనీలాండరింగ్ కేసు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున దానిపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థ, దర్యాప్తు అధికారిపై ట్రయల్‌కోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై స్టే విధిస్తున్నాం. ఈ కోర్టులో ప్రస్తుత విచారణ పూర్తయ్యేంతవరకూ ఈడీ కేసుపై విచారణను వాయిదా వేయాలని ట్రయల్‌కోర్టును ఆదేశిస్తున్నాం” అని పేర్కొంటూ తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేశారు.

**దిల్లీ చరిత్రలో అతిపెద్ద కుంభకోణం..**

అంతకుముందు తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. దేశ రాజధాని చరిత్రలో జరిగిన అతిపెద్ద కుంభకోణాల్లో దిల్లీ మద్యం కేసు ఒకటి అని పేర్కొన్నారు. “మద్యం విధానంలో తమకు అనుకూలమైన నిబంధనలు పొందుపరిచినందుకు నిందితులు ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన విజయ్‌నాయర్‌కు రూ.100 కోట్లు చెల్లించారు. ఇందులో రూ.44.50 కోట్లు హవాలా రూపంలో బదిలీ చేశారు. ఆ డబ్బు గోవా ఎన్నికల్లో పార్టీ ఫండ్ కింద వెళ్లిందని సీబీఐ శాస్త్రీయ ఆధారాలతో నిరూపించింది. అయినప్పటికీ ట్రయల్‌కోర్టు న్యాయమూర్తి ఎలాంటి విచారణ చేపట్టకుండానే నిందితులందర్నీ విడుదల చేశారు. ఈ డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయిన 12 రోజుల్లోనే ట్రయల్‌కోర్టు న్యాయమూర్తి 600 పేజీల తీర్పు వెలువరించడం విచిత్రంగా ఉంది. అప్రూవర్లు ఇచ్చిన వాంగ్మూలాలను ప్రాథమిక దశలోనే మిగతా సాక్ష్యాధారాలతో సరిపోల్చి చూడాలని చెప్పి న్యాయసూత్రాలను తప్పుగా అన్వయించారు. వాస్తవానికి అప్రూవర్ల వాంగ్మూలాలను ట్రయల్ దశలో మాత్రమే మిగతా ఆధారాలతో సరిపోల్చి చూడాలి. ముడుపుల కోసం నగదును తమ ఆఫీసు నుంచి సేకరించి మధ్యవర్తుల ద్వారా బదిలీ చేసినట్లు అప్రూవర్ దినేశ్ అరోడా చెప్పారు. అశోక్ కౌశిక్ అనే వ్యక్తి దిల్లీలోని ఓ చిరునామా నుంచి తాను రెండు పెద్ద బ్యాగుల్లో నగదు తీసుకొచ్చి నిందితుల అడ్రస్‌లో ఇచ్చినట్లు వాంగ్మూలమిచ్చారు. ఆ విషయాన్ని ట్రయల్‌కోర్టు ఎక్కడా ప్రస్తావించలేదు. ముడుపులు ఇచ్చిన వారు చెప్పిన అంశాలనే దిల్లీ మద్యం విధానంలో చేర్చినట్లు బుచ్చిబాబు వాట్సప్ చాట్స్ ద్వారా నిరూపితమైంది. ఆ చాట్స్‌లో ఉన్న విషయాలే అప్పటి మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సుల్లో యథాతథంగా వచ్చాయి” అని తుషార్ మెహతా వాదించారు. మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్, తదితరుల్ని నిర్దోషులుగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు చేసిన వ్యాఖ్యల్ని కొట్టివేయాల్సిందిగా కోరుతూ ఈడీ.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం
10 మార్చి 2026

సంపాదకీయం

# నేపాల్‌పై యువకేతనం

ఉవ్వెత్తున ఎగసిన నేపాల్ యువ తరంగంలో ఆర్నెల్లు దాటుతున్నా ఆగ్రహాగ్ని చల్లారలేదని, దాని సంకల్పం చెదరలేదని గత గురువారం నాటి పార్లమెంటు ఎన్నికలు నిరూపించాయి. నేరుగా ఎన్నికలు జరిగిన 165 స్థానాల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ(ఆర్ఎస్‌పీ) 125 సొంతం చేసుకుని ప్రజాస్వామ్యంతో ఇన్నాళ్లూ చదరంగమాడిన ప్రధాన పక్షాలన్నిటినీ తీవ్రంగా దెబ్బతీసింది. మరో 110 మందిని ఆ యా పార్టీలకొచ్చిన ఓట్ల శాతం ఆధారంగా నిర్ణయిస్తారు. ఏ పార్టీకీ తిరుగులేని మెజారిటీ ఉండరాదన్న ఆలోచనతో నేపాల్ దేశ రాజ్యాంగంలో ఈ ప్రాతినిధ్య నిష్పత్తి విధానాన్ని పొందుపరిచారు. తీరా ఆర్ఎస్‌పీ దాన్ని సైతం అధిగమించి మూడింట రెండొంతుల మెజారిటీ దిశగా దూసుకుపోతోంది. గెలుపు కోసం ప్రచార పటాటోపం, విచ్చలవిడి వ్యయం అవసరం లేదని, కేవలం హ్యాష్‌టాగ్‌లే ప్రత్యర్థులను మట్టికరిపిస్తాయని ఆర్ఎస్‌పీ నిరూపించింది. కీలకమైన అంశం ఏమంటే పట్టణాలు, పల్లెల వ్యత్యాసం లేకుండా అన్నిచోట్లా వామపక్షాలు, నేపాలీ కాంగ్రెస్ పార్టీ గల్లంతయ్యాయి. నేపాల్ మాదిరే శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో కూడా యువత తిరగబడి పాలకులు పదవులు వదిలి పారిపోయేలా చేసింది. కానీ ఆ రెండుచోట్లా ఎన్నికల సమయానికల్లా సంప్రదాయ పక్షాలు ప్రత్యక్షమయ్యాయి. శ్రీలంకలో 1960లో ఏర్పడిన జనతా విముక్తి పెరుమున(జేవీపీ), బంగ్లాలో 1980లో ఆవిర్భవించిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) విజేతలయ్యాయి. అక్కడ ఉద్యమంలో ముందుండి పనిచేసిన యువతకు అధికారంలో చోటు దక్కలేదు. కానీ నేపాల్ పరిస్థితి వేరు. సామాజిక మాధ్యమాల నిషేధంతో ఆగ్రహించి వీధుల్లోకొచ్చిన యువతకు ఆర్ఎస్‌పీకి చెందిన 35 ఏళ్ల బాలేంద్ర షా, ఇతర నేతలు మార్గదర్శనం చేశారు. వారితోపాటే నడిచారు. వారికి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇచ్చారు. పర్యవసానంగా ఈసారి ఎన్నికల్లో పార్టీల, నాయకుల కంచుకోటలు అనుకున్నవి తునాతునకలయ్యాయి. వీటన్నిటా గతానుభవం లేని యువత విజేతలయ్యారంటే సాధారణ ప్రజానీకం పాత తరంతో ఎంత విసుగెత్తిపోయారో అర్థం చేసుకోవచ్చు. అజేయుడనుకున్న మాజీ ప్రధాని కేపీ ఓలిశర్మ... బాలేంద్ర షా చేతిలో అవమానకరమైన రీతిలో ఓటమి పాలయ్యారు. ఒకప్పుడు విప్లవ వీరుడిగా నీరాజనాలందుకున్న మావోయిస్టు సెంటర్ నాయకుడు ప్రచండ అతి కష్టం మీద గట్టెక్కారు. ఆయన పార్టీకి ఒక డజను స్థానాలు మించి వచ్చే అవకాశం లేదు. అయితే ప్రధాని కాబోతున్న బాలేంద్ర షా ముందు ఎవరెస్టు శిఖరాన్ని తలపించేలా సమస్యలున్నాయి. నిరుద్యోగం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఆర్థిక వ్యత్యాసాలు ఆ దేశాన్ని పీడిస్తున్నాయి. ఉద్యోగాలు లేక జనాభాలో మూడోవంతు మంది చిన్నా చితకా ఉద్యోగాల కోసం భారత్ సహా పలు దేశాలకు వలస పోతున్నారు. వారు ప్రతి నెలా కుటుంబాలకు పంపే డబ్బే నేపాల్ ఆర్థిక వ్యవస్థకు ఆలంబన. నేపాల్ జీడీపీలో ఇది 28 శాతం. జలవిద్యుదుత్పాన మినహా ఖజానా కళకళలాడటానికి తోడ్పడే సహజ వనరులు లేవు. లోటు ఆర్థిక వ్యవస్థ, అరకొర వేతనాలు నేపాల్‌కు శాపాలు. మన దేశం తోడ్పాటునిస్తే ఉపాధి కల్పనకు బాటలు పరిచే ప్రాజెక్టులు వస్తాయని యువత ఆశిస్తోంది. అందుకే కావొచ్చు... ప్రతి ఎన్నికల్లోనూ రివాజుగా కనబడే భారత వ్యతిరేకత ఈసారి దాదాపు కనుమరుగైంది. సుస్థిర పాలన వుంటే ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తారు. అది లేకపోవటమే నేపాల్ ఎదుగుదలకు ఇన్నాళ్లూ ఆటంకంగా మారింది. పాలన అంటే నిరసనోద్యమాలు నడపటమంత సులభం కాదు. ఉద్యమకారుడి గెటప్ నుంచి సమర్థ పాలకుడిగా బాలేంద్ర పరివర్తన చెందాల్సి ఉంది. అసలే కోవిడ్ మహమ్మారితో విదేశాల్లో కొలువులు కొడిగడితే, వర్తమాన పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఆ సమస్యను మరింత పెంచాయి. లుంబినీ వనం, ఎవరెస్టు శిఖరం ఉన్నా పర్యాటక రంగం ఎదుగుదల లేదు. ఇవన్నీ మళ్లీ పట్టాలెక్కాలంటే పారదర్శక పాలన, నిపుణుల తోడ్పాటు, ఇరుగుపొరుగు ఆపన్న హస్తం అవసరం. మూణ్ణెల్లు గడిస్తే చాలు... జనం నిలదీయటం మొదలుపెడతారు. గత పాలకుల కన్నా భిన్నమైనవాడినని నిరూపించుకోవటం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పాలన అందించటం బాలేంద్రకు తక్షణ సవాళ్లు.

# బిహార్‌లో ‘జాతీయ’ గీతం!



ఊహించని నిర్ణయాలతో తరచు అందరినీ ఆశ్చర్యపరిచే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈసారి మాత్రం దిగ్భ్రాంతిలో ముంచెత్తారు. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకుని గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయటంతో జేడీ(యూ) అగ్రనాయకులే ఖిన్నులయ్యారు. వారికి కేవలం కొన్ని గంటలముందు మాత్రమే తెలిసింది మరి. పదేళ్లుగా తన పదునైన వ్యూహాలతో దేశంలో బీజేపీ ఎదుగుదలకు చక్రం తిప్పుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాయే ఈ ఊహించని పరిణామానికి కూడా బాధ్యులని మీడియా కథనాలు చెబుతున్నాయి. నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నితీశ్ వాస్తవానికి తన కుమారుడికి రాజ్యసభ అవకాశం ఇవ్వాలని నెల్లాళ్లుగా బీజేపీ అగ్రనేతలను అడుగుతూ వస్తున్నారు. తీరా ఆయన హఠాత్తుగా స్వరం మార్చారు. మధ్యమధ్య కొత్త పొత్తులతో జనం ముందుకెళ్తున్నా మెజారిటీ కాస్త అటూ ఇటూఅయింది తప్ప గత 20 సంవత్సరాలుగా ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగారు. తాను రాష్ట్రంలో ఉభయ సభలతోపాటు లోక్‌సభ సభ్యుడిగా కూడా పనిచేశాననీ, రాజ్యసభకు వెళ్లలేదన్న అసంతృప్తిని పోగొట్టుకోవటానికే తాజా నిర్ణయం తీసుకున్నాననీ ఆయన చెబుతున్న మాటల్ని మద్దతుదారులు విశ్వసించటం లేదు. పార్టీలో అంతఃకలహాలు, సహకరించని ఆరోగ్యం ఆయన తాజా నిర్ణయానికి కారణమన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. బిహార్ రాజకీయాలపై నితీశ్ ముద్ర చెరగనిది. 1974 నాటి అవినీతి వ్యతిరేక ఉద్యమ నేతగా ముందుకొచ్చిన విద్యార్థి నాయకుల్లో నితీశ్ ఒకరు. 90వ దశకం నుంచీ రాష్ట్ర రాజకీయాల్లో ఆయనదే కీలక భూమిక. తనతోపాటు రాజకీయాల్లో అడుగుపెట్టిన లాలూ ప్రసాద్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్‌లతో పోలిస్తే నితీశ్ వ్యూహ చతురత గలిగినవారు. అందుకే ‘సామాజిక న్యాయ’ రాజకీయాల ప్రభావం గణనీయంగా ఉన్న రాష్ట్రంలో చెప్పుకోదగ్గ సంఖ్యలో లేని కుర్మీ సామాజిక వర్గం నుంచి వచ్చినా అందరినీ ఆకట్టుకోగలిగారు. అత్యంత వెనుకబడిన కులాలకూ(ఈబీసీ), దళితుల్లో అట్టడుగు వర్గాలకూ పదవుల పంపకంలో ప్రాధాన్యమీయటంతోపాటు తన కుర్మీ సామాజిక వర్గాన్నీ, కుష్వాహాలనూ ఏకం చేశారు. ఆయన విజయాలకు ఈ సమీకరణాలొక్కటే కాదు... వాటితోపాటురాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించి ‘మంచి పాలన’ అందిస్తున్నా రన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించగలిగారు. ఆయనకు ‘సుశాసన్ బాబు’ అనే పేరు వచ్చింది అందుకే! కూటమిలో జూనియర్ భాగస్వామిగా చేరినా, అచిరకాలంలోనే అగ్రభాగానికి ఎగబాకుతుందని బీజేపీపై ఇప్పటికే ముద్రపడింది. మహారాష్ట్రలో జరిగింది ఇదే. ఇప్పుడు బిహార్‌లోనూ ఇదే కొనసాగుతోంది. కేంద్రంలో ఎన్డీయే మనుగడకు జేడీ(యూ) మద్దతు తప్పనిసరైనా, రాష్ట్రంలో ఆ పార్టీ సారథ్యాన్ని తప్పించటం చిన్న విషయమేమీ కాదు. 2020 ఎన్నికల్లో తొలిసారి జేడీ(యూ)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ ఎన్నికల్లో బీజేపీ కన్నా తనకు అదనంగా ఒక్క స్థానమైనా కావాలని పట్టుబట్టి తీసుకున్న ఆ పార్టీకి తీరా 43 మాత్రమే లభించాయి. బీజేపీకి ఆ ఎన్నికల్లో వచ్చినవి 74. అందుకే సీఎం పదవి నిలుపుకోవటంపై సంశయం ఏర్పడి నితీశ్ మధ్యలో ఆర్జేడీ వైపు వెళ్లారు. ఆ చెలిమి ఎన్నాళ్లో కొనసాగలేదు. తిరిగి ఎన్డీయే గూటికి చేరారు. మొన్న నవంబర్‌లో జేడీ(యూ)కు 85 లభించగా, బీజేపీ గెల్చుకున్నవి 89. అధిక స్థానాలున్న పక్షంగా సీఎం పదవి అడగాల్సి ఉన్నా తాత్కాలికంగా బీజేపీ వెనక్కుతగ్గింది. అదును చూసి నాలుగు నెలల్లో సాధించింది. పార్టీకి ప్రధాన వనరైన మహిళలు, రైతులు బీజేపీ వైపు మొగ్గుతున్నారన్న సమాచారంతో జేడీ(యూ) నేతలు అప్రమత్తమవుతున్నట్టు కథనాలు వచ్చాయి. అందుకే ఇక ఆలస్యం చేయరాదని బీజేపీ భావించినట్టు కనబడుతోంది. నితీశ్ నిష్క్రమణ, బీజేపీ ఆగమనంతో బిహార్ రాజకీయాల్లో సోషలిస్టు నేపథ్యంగల ప్రాంతీయ పార్టీల పాత్ర కొడిగడుతుంది. రాజ్యసభకు వెళ్లినా బిహార్‌లో తన ముద్రఉంటుందని నితీశ్ చెబుతున్నా అది ఆచరణలో సాధ్యపడదు. ఒకటి నిజం -- ఇప్పటికీ బిహార్ నిరుపేద రాష్ట్రాల్లో ఒకటిగానే ఉంది. తన ఏలుబడిలో బీజేపీ దాని ముఖచిత్రాన్ని ఏ మేరకు మార్చగలదో వేచిచూడాలి.

# అక్షరాలా ఉగ్రవాద చర్య



ఒకపక్క చర్చలు సాగుతుండగా అన్ని రకాల నీతి నియమాలనూ కాలదన్ని ఇరాన్‌పై దండయాత్ర ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దిగజారుడుతనం ఉన్నకొద్దీ మితిమీరుతోంది. మంగళవారం రాత్రి శ్రీలంక తీరానికి సమీపంలో హిందూ మహాసముద్ర జలాల్లో 130 మంది నావికులతో ప్రయాణిస్తున్న ఇరాన్ యుద్ధనౌక ‘ఐఆర్ఐఎస్ దేనా’పై జలాంతర్గామి ద్వారా దొంగదెబ్బ తీసి 92 మంది నావికుల మృతికి కారణం కావటం ఆ వరస లోనిదే. భారత నావికాదళం ఆహ్వానంపై విశాఖలో ‘మిలన్--2026’ నావికాదళ విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెడుతుండగా ఈ దాడి జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి అణు జలాంతర్గామి ద్వారా టార్పెడోను ప్రయోగించి నౌకను ధ్వంసం చేశామని అమెరికా సంబరంగా ప్రకటించుకుందిగానీ... ఈ చర్య అనేక విధాల ఖండనార్హమైనది. భద్రతా మండలిలో రష్యా, చైనాలు చెప్పినట్టు ‘అంతర్జాతీయ ఉగ్రవాద చర్య’. ఆ రెండు దేశాల వల్లా ఉద్రిక్తతలు పెరగటం ఒక్కటే కాదు... ఆ బాంబులు, క్షిపణుల్లో వాడే రసాయనాల వల్ల పర్యావరణానికి పెను ముప్పు కలుగుతుంది. ధ్వంసమైన నౌక నుంచి లీకవుతున్న చమురు వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని శ్రీలంక వ్యక్తం చేస్తున్న ఆందోళన కూడా సహేతుకమైనది. ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి ఆ నౌక వేలాది కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశాలకుండే సార్వభౌమత్వం వాటికి సంబంధించిన నౌకలకు సైతం వర్తిస్తుంది. ముఖ్యంగా ఘర్షణ ప్రాంతాల్లో కాక ప్రశాంత జలాల్లో పయనించే సైనిక నౌకలను ‘నిరపరాధ’ నౌకలంటారు. ముందస్తు సమాచారంతో వెళ్లే ఆ నౌకలపై ఎవరూ దాడి చేయరు. ప్రాదేశిక సముద్ర ప్రాంతం, దాని చేరువ ప్రాంత జలాల్లో వెళ్లే యుద్ధ నౌకల విషయంలో పాటించాల్సిన నీతిపై 1958లో అంతర్జాతీయ ఒడంబడిక కుదిరింది. దానిపై అందరితోపాటు అమెరికా కూడా సంతకం చేసింది. దాన్ని బేఖాతరు చేయటం దానికదే పెద్ద నేరం. ఇదెక్కడి రణనీతి? మన ఆహ్వానంపై వచ్చి వెడుతున్న అతిథి వంటిది ఆ నౌక. మన మిత్రదేశంగా ఉంటూ మన సంప్రదాయాలను ఉల్లంఘించి దానిపై దాడి చేయటం అమెరికా అమిత్ర చర్య. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతి మండలంగా ఉంచాలని దశాబ్దాలుగా మన దేశం చేస్తున్న కృషికి తూట్లు పొడవటం కూడా! మనకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అణు జలాంతర్గామిని ఇటువైపు పంపడం ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టం ఒడంబడిక రీత్యా కూడా అత్యంత దారుణమైనది. 2021లో కూడా ఎలాంటి సమాచారమూ లేకుండా లక్షద్వీప్ సమీపంలో అమెరికా నావికా విన్యాసాలకు తెగబడింది. అందుకే భారత నావికాదళ మాజీ అధిపతి అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ చెప్పినట్టు ఇది మన సరిహద్దుల్లోకి యుద్ధాన్ని విస్తరింపజేయటంతో సమానం. కనుక అమెరికాకు మన అసంతృప్తిని తెలియజేయటం అత్యంత అవశ్యం. మిలన్ అంటే స్నేహపూర్వక కలయిక లేదా సమ్మేళనం. అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలకు మన దేశం ఆ పేరు పెట్టడంలోనే సుహృద్భావం, సహకారం, ఐక్యత ధ్వనిస్తున్నాయి. అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తూ సముద్ర జలాల భద్రత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నది ఈ సమ్మేళనం ఆంతర్యం. అన్నిటికన్నా ముఖ్యం-- ప్రశాంత జలాల్లో ఇటువంటి దాడి జరిగితే గాయాల పాలైన నావికాదళ సభ్యుల్ని కాపాడటానికి ప్రయత్నించాలన్నది అన్ని దేశాల నావికా దళాలు పాటించే అలిఖిత నియమం. ఈ ఘనకార్యం తర్వాత అమెరికా జలాంతర్గామి కనీసం అక్కడ అర క్షణమైనా నిలబడే ప్రయత్నం చేయకుండా పరారైన తీరు సిగ్గుచేటైనది. అంతర్జాతీయ చట్టాలతోపాటు స్వదేశీ చట్టాలను కూడా ఉల్లంఘించి యుద్ధం మెదలెట్టిన ట్రంప్ తాను ఎవరికీ జవాబుదారీ కాదనుకుంటున్నారు. దీన్నెవరూ అంగీకరించకూడదు. అమెరికా, ఇజ్రాయెల్‌ల తప్పుడు చర్య వల్ల పశ్చిమాసియా రణరంగంగా మారి ఎగుమతులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరో నెల్లాళ్లవరకే వంటగ్యాస్ నిల్వలున్నాయంటున్నారు. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఆ రెండు దేశాల తప్పుడు చర్యను ఖండించటానికి ప్రభుత్వాలు సంశయిస్తున్న వేళ ఆ దేశాల ప్రజలతో సహా ప్రపంచమంతా ముక్తకంఠంతో నిరసిస్తే తప్ప ఈ దుండగం ఆగదు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం
10 మార్చి 2026

# సాధారణ ఆసుపత్రిలో ప్రత్యేక సదరం శిబిరం విజయవంతం





శిబిరంలో ప్రత్యేకంగా గుర్తించిన 44 మంది హాజరు,10 మంది దృష్టిలోప రోగులు హాజరు

జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్

**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్**

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రత్యేకంగా గుర్తించిన తీవ్రమైన నరాల బలహీనత, కండరాల బలహీనత గల వారికి సోమవారం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరాన్ని డిప్యూటీ మెడికల్ సూపరిండెండెంట్ డాక్టర్ వి.శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వివిధ అంగవైకల్యాలతో ధ్రువీకరణ పత్రాలు పొంది, నేటికీ వారి శరీరంలో జరిగిన అధిక మార్పులు గుర్తించిన 56 మందికి నిర్వహించిన ప్రత్యేక సదరం శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. రవికుమార్ నాయక్ ఇతర వైద్య బృందం హాజరైన 44 మందికి ప్రత్యేకంగా పరీక్షలు జరిపారు. అదేవిధంగా సదరం శిబిరంలో భాగంగా కంటి చూపు దృష్టిలోపం గల వారికి పది మందికి ప్రత్యేకంగా శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. దాదాపు 100% అంగవైకల్యం ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో అధిక మొత్తంగా పెన్షన్ మంజూరు చేయనున్నట్లు సదరం అధికారులు తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారిని కంటి విభాగపు వైద్యులు డాక్టర్ ప్రియాంక వైద్య బృందం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదరం శిబిరం అధికారులు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.శ్రీనివాసులు, క్యాంప్ అడ్మిన్ ఏ.నరసింహారెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ పి.ప్రభాకర్, క్యాంప్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఏ.హైమావతి, ధాన్గట్ల చంద్రశేఖర్, నర్సింగ్ సూపర్డెంట్ మంజుల, నర్సింగ్ అధికారులు ఎం.ఆనంద్, సిబ్బంది యాదగిరి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జంగిటి రవీందర్**

రానున్న వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లాలో మంచి నీటి సరఫరా పై ఆర్ డబ్ల్యుయస్, మిషన్ భగీరథ, హెచ్ యం డబ్ల్యూ ఎస్, ఎస్ ఈ పబ్లిక్ హెల్త్ సంబంధిత శాఖల అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ.. మల్లన్న సాగర్ నుండి ఘన్ పూర్ వరకు 210 కోట్ల తో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని



చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను కోరారు . నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. నీటి ఎద్దడి నెలకొనేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిచ లన్నారు.వేసవి సీజన్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టేవిధంగా అధికారులను, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్.ఈ కృష్ణయ్య, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకరన్, యస్.ఈ పబ్లిక్ హెల్త్ వెంకటేశ్వర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం శశాంక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టిటిడి ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ పేదల ప్రాణాలకు వరంతి

రుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) ఆధ్వర్యంలోని టిటిడి ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ పేద వర్గాల ప్రాణాలకు వరంగా నిలుస్తోంది. రాయలసీమ జిల్లాలలో గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్, న్యూరో సంబంధిత ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఖరీదైన వైద్య చికిత్సలను ఉచితంగా అందించాలనే దివ్యసంకల్పంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ ను 2001 అక్టోబర్ 01న ప్రారంభించారు.ఈ మహోన్నత సేవా కార్యక్రమం తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆధ్వర్యంలో కొనసాగుతూ, పేద రోగులకు ప్రాణాధారంగా నిలుస్తోంది.దీర్ఘకాలిక వ్యాధులకు సహాయంఈ ట్రస్ట్ ద్వారా దీర్ఘకాలిక మరియు నిర్దిష్ట వ్యాధుల చికిత్సతో పాటు వాటిపై పరిశోధనలు కొనసాగుతున్నాయి.

ముఖ్యంగా ?దీర్ఘకాలిక మూత్రపిండాల వైఫల్యం, హీమోఫిలియా, థలసేమియా, క్యాన్సర్, గుండె జబ్బులు, నాడీ సంబంధిత వ్యాధులు, అటాక్సియా, కొరియా, హెమిబాలిస్మస్, అఫాసియా వంటి న్యూరోలాజికల్ తదితర వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులకు ఉపశమనం కలిగేలా ప్రణాళికాబద్ధ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. పేద రోగులకు వైద్య ఖర్చులు, శస్త్రచికిత్సలు, కృత్రిమ అవయవాలు, ఇంప్లాంట్లు, బ్లడ్ బ్యాంక్ లాంటి వైద్య సేవలను ఎలాంటి వివక్ష లేకుండా అందిస్తున్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం

ఆళ్లగడ్డ

మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం పాఠశాలలకు సెలవు దినం సందర్భంగా ముందస్తు వేడుకలుగా ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్లలో కే పి జి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులు శుభ , హెబ్సిబా, భార్గవి, అశ్విని, ధరణి, శ్వేత మరియు విద్యార్థి బృందంతో కలిసి శనివారం నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ వందనం వందనం మహిళా వందనం జయహో నారీమణి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని నింపారు.ఈ సందర్భంగా అపస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం యూనిట్ అధ్యక్షులు మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో పురుషులకు సమానంగా మహిళల పోరాటపటిమను స్మరించుకుంటూ ఘనమైన నివాళి అర్పించుకుంటూ నేటి పోటీ ప్రపంచంలో విద్య వైద్య క్రీడా రాజకీయ వైజ్ఞానిక సైనిక వ్యాపార ఉద్యోగ ఉపాధ్యాయ సమాజ సేవ రంగంలో రాణిస్తూ అనేక రంగంలో పురోభివృద్ధి సాధిస్తున్న మాన్యులు మహిళా మూర్తులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు భారతదేశమంటే భారతమాత ఒక తల్లి స్వరూపం స్త్రీలు సృష్టికి మూలం ఇండియన్ సొసైటీలో ఉమెన్ పిల్లర్ తెలుపుతూ మహిళా సాధికారతకు మార్పు అన్నది మొదట కుటుంబ వ్యవస్థలో అబ్బాయిలు అమ్మాయిలు సమానంగా ఒకే రీతిలో చూడటం సదవేషములగాని మరి ఏ విషయంలో అయినా అసమానతలు లేకుండా చూడాలి విద్యాసంస్థలలో ఉపాధ్యాయులు బాలికల బాలుర విషయంలో ఆలోచన పరిధిని గమనించి మంచి వైపు నడిపించి జనరల్ ఈక్వాలిటీ భావనను పెంపొందించి సమాజానికి ఉత్తమ పౌరులను అందించి నేటి బాలికలైన విద్యార్థులు రేపటి మహిళలు కావున వారికి మనోధైర్యం ఆత్మవిశ్వాసం లక్ష్యం జీవితములో సాధించాలన్న భావన పెంపొందించాలి అని సందేశం ఇచ్చారు.

## నూతన నీటి పైపులైను ఏర్పాటు

బేతంచర్ల

బేతంచర్ల మండల పరిధిలోని నాగమల్లకుంట గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నీటి పైపులైను పాడై మరమ్మతులకు గురి కావడంతో మండల పరిషత్ లోని రెండు లక్షల నిధులతో నూతన పైపులైను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. శనివారం నాడు నూతన పైపులైను ఏర్పాటును గోరుకల్లు నుండి నీటి

## ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జంగిటి రవీందర్**

భువనగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది ఎర్రం లక్ష్మి విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానమని మహిళలు అన్ని రంగాల్లో విజయాన్ని సాధించాలని, ప్రతి పనిలో పురుషులతో సమానంగా ముందుండాలని సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో మంచి విజయాలు అందుకుని ప్రయాణం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ మహిళ లెక్చరర్లు, అతిథులు మహిళా సిబ్బంది అందరికీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తోటకూరి రామకృష్ణ, కనక బాలరాజు, ఎండీ.అత్తరు ఫరీన్, కూరపాటి స్రవంతి వల్లస్ అలివేలు మహిళా లెక్చరర్లు ఎన్ సుధా, సుమలత, సరిత, సంధ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ సబ్ ప్లాన్ ద్వార రూ. 5 లక్షలు మంజూరు

### ఎస్సీ కాలనీలో కొత్త పనులు ప్రారంభించిన సర్పంచ్ బాలస్వామి

**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్**





బిజినపల్లి మండలంలోని గుడ్లనర్వ గ్రామంలో తను ఎన్నికలో ఇచ్చిన హామీలో భాగంగా ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరైన ఐదు లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కొబ్బరికాయ కొట్టి ఆదివారం గ్రామ సర్పంచ్ లేట్ల బాలస్వామి ప్రారంభించారు. 15 సంవత్సరాలుగా డ్రైనేజీ లేక బాధపడుతున్న ఎస్సీ కాలనీ వాసుల కళ నెరవేర్చానని వారన్నారు. వట్టెం రాములు ఇంటి నుండి,లేట్ల పెంటయ్య ఇంటి వరకు,మరియు బైండ్ల రాజు ఇంటి నుండి,రెడ్డపాకుల పెద్ద మల్లయ్య ఇంటి వరకు డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు.ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా పూర్తి చేస్తానని,గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారి చొరవతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిదల రాము,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరావు,ఎల్ వెంకట్,పద్మ శ్రీను,అతినారపు సంజీవ,గొల్ల రాజు,చిన్న భీమ్లా,గ్రామ వార్డు మెంబర్లు రామగళ్ల మన్యం,భీమ రావు,లేట్ల శివకృష్ణ,అలివేల, మరియు బాల్ నారాయణ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రిజం విద్యా సంస్థ దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు

95 టీంల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు



**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్**

జిల్లా కేంద్రంలోని ప్రిజం విద్యా సంస్థను స్థాపించి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది వేడుకలు ఫంక్షన్ హాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్ల నిరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉపాధి దిశగా వెల్లుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ వేడుకలలో విద్యార్థుల యొక్క ప్రతిభ పాటాలు ఆట, పాట, నాట్యరీతిలను కనబరుస్తూ 95 టీంలతో వచ్చినటువంటి విద్యార్థులను, పోషకులను ఆనంద ఉత్సవాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వారి శాస్త్ర సాంకేతిక జ్ఞాన నివేదికలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ వేడుకలలో ప్రిజం స్కూల్ యాజమాన్యం కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ దాసర్ల దేవేందర్, స్వప్న పాల్గోని విద్యార్థులను అభినందించారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేవేందర్, పవన్, రామకృష్ణ, సలీమ్, భలిందర్, భరత్, వసంత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి




**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జంగిటి రవీందర్**

భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 35 వార్డులలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి సూచించారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో పట్టణంలోని 4, 11, 16, 17, 35 వార్డులలో ఆమె ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు స్థానిక వినాయక చౌరస్తా నుండి పాత బస్టాండ్ మీదుగా వినాయక చౌరస్తా వరకు వరకు 5 కే రన్ నిర్వహించారు. వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల, స్థానిక గౌరవ వార్డు సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరూ హాజరయ్యారు. 35వ వార్డులో ఉన్నటువంటి పందుల సమస్యలను నివారించుటగాను సదరు పందుల పెంపకం దారులు అందరూ తమకు సంబంధించిన పందులను పట్టణం నుండి పట్టణ శివారు ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల సిబ్బంది రోగులకు పండ్ల పంపిణీ



**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది సోమవారం సాధారణ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి. శేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్ నాయక్ పండ్ల పంపిణీ ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు సేవాతత్వరత కలిగి ఉండడం మంచిదని అన్నారు. ఆస్పత్రిలోనీ పలు వార్డులలోని చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, ఆసుపత్రి నర్సింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం పాట

కౌతాళం

కౌతాళం మండల పరిధిలో గ్రామం నందు పుణ్యక్షేత్రం శ్రీ లక్షి నరసింహ ఉరుకుంద వీరన్న స్వామి దేవస్థానంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట ద్వారా భారీగా ఆదాయం పెరిగింది ఏడది పాటు భక్తులు సమర్పించిన తలనీలాలు చేసుకునేందుకు ఆన్లైన్లో బహిరంగ వేలం పాటలకు దేవాలయం శాఖ అధికారి వెంకటేశ్వర్లు అధ్వరంలో డిపోటీ కమిషనర్ వాణి పిలుపునిచ్చారు అదేవిధంగా ఉరుకుంద ఉప చైర్మన్ అయ్యప్ప వేలం పాటలో పోటీ పోటీగా పాటదారులు పోలోగనడంతో దేవాలయానికి ఈ ఏడాది రూ 2.07.45000లకు రాజు ఎంటర్ ప్రైజెస్ వారు బహిరంగ వేలం పాట ద్వారా దక్కించుకున్నారు ఆన్లైన్ టెండర్ దారులు నిబంధనల ప్రకారం తమ అధికారులకు సమర్పించుకోవడంతో వాటిని దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం రద్దు చేసినట్టు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు, శివుడు టెండర్



# పొద్దున్నే అరటి పండు తింటున్నారా?

అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో ఒకటి. అంతేకాదు.. అన్ని సీజన్లు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది అరటి పండు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ అరటి పండును ఇష్టంగా తింటారు. చాలా మంది ఉదయం అల్పాహారం ముందు లేదా ఖాళీ కడుపుతో అరటిపండు తినే అలవాటు పెట్టుకుంటారు. అరటి పండులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీని వలన జీర్ణశక్తి పెరగడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే నిద్రలేవగానే అరటి పండు తినడం మంచిదేనా ? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియంతో పాటు అరటి పండులో నేచురల్ షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వలన బీపీ పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటంలో కూడా అరటిపండు ఉపయోగపడుతుంది. ఉదయాన్నే అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది సహజమైన చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్) కలిగి ఉండటం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అరటిపండు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి పరిష్కారంగా ఉంటుంది. ఉదయం అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపయోగకరం. ఇందులో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉండటంతో ఇది శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. అరటిపండులో పొటాషియం, ఫైబర్, విటమిన్ అ, విటమిన్ ః6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే అరటి పండు తినడం వలన ఇన్‌స్టాంట్ ఎనర్జీ లభిస్తున్నప్పటికీ ఆరోగ్యనిపుణులు ఇది మంచిది కాదని తెలిపారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన యాసిడిటీ సమస్య రావచ్చని చెబుతున్నారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన తక్షణమే శక్తి లభిస్తుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం లెవల్స్ సమృద్ధిగా ఉంటాయి. అరటి పండులో తక్కువ కేలరీలు ఉన్నప్పటికీ, అధికంగా తినడం వలన శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ఖాళీ కడుపుతో ఎక్కువగా అరటిపండ్లు తినడం మంచిది కాదని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ లేదా ఆమ్లత్వ సమస్యలు ఉన్నవారు పరిమితంగా తినడం మంచిది. మొత్తానికి ఉదయం ఒక అరటిపండు తినడం శరీరానికి శక్తి, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే సమతుల ఆహారంతో పాటు తీసుకుంటే మరింత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# నానబెట్టిన కిస్‌మిస్‌తో బెనిఫిట్స్?



నానబెట్టిన ఎండు ద్రాక్ష శక్తివంతమైన పోషకాల గని. వీటిని రాత్రి నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం వలన జీర్ణశక్తి, గుండె ఆరోగ్యం మెరుగుపడతాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది, శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ చిన్న పండ్లను మీ దినచర్యలో భాగం చేసుకోండి. ద్రాక్షలు.. చూసేందుకు చాలా చిన్నసైజు పండ్లు.. కానీ, ఇది శక్తివంతమైన పోషకాలతో నిండినవి. ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారు. ఇందులో ఫైబర్, విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వాటిని రాత్రి నీటిలో నానబెట్టి, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. నిపుణుల ప్రకారం, నానబెట్టిన ద్రాక్షలను తినడం వల్ల శరీరంలో డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి పెరుగుతుంది. నానబెట్టి కిస్‌మిస్ తినడం వలన జీర్ణశక్తి పెరుగుతుంది, గట్ హెల్త్ మెరుగవుతుంది. ఇందులో వాటర్ కంటెంట్, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వలన మలబద్ధకం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నానబెట్టిన కిస్‌మిస్‌లో పొటాషియం,ఇతర సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. దీని వలన గుండె పనితీరు మెరుగవుతుంది. నానబెట్టిన ద్రాక్షల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రెషర్, కొలెస్ట్రాల్ లెవెల్స్ నియంత్రణలో సహాయపడతాయి. దీనివల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. నానబెట్టిన ద్రాక్షలు రుచి మాత్రమే కాకుండా ఫైబర్ కారణంగా కడుపును సక్రమంగా ఉంచి, పేగు సమస్యలు, కడుపు నిండినట్లు అనిపించడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్యను నివారించడంలో ఇది ఫలవంతంగా పని చేస్తుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలో నేచురల్ షుగర్స్‌తో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వలన తక్షణ ఎనర్జీ లభిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. స్కిన్ హెల్త్ మెరుగవుతుంది. నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ మితంగా తీసుకోవడం ఎంతో ముఖ్యం. నానబెట్టిన ద్రాక్షలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు ఉండటంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ప్రతిరోజు ఖాళీ కడుపుతో నానబెట్టిన ద్రాక్షలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. ఉద్యోగ, చదువులు లేదా వ్యాయామంలో అలసట తక్కువగా ఉంటుంది. అదనంగా, ఇది బోన్లు, దంతాల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్రతి రోజు రాత్రి నానబెట్టి, ఉదయం 5?10 ద్రాక్షలు తినడం, శక్తివంతమైన, ఆరోగ్యకరమైన అలవాటు. ఇది శరీరానికి, చర్మానికి, హృదయానికి, జీర్ణక్రియకు, ఇమ్యూనిటీకి ఎంతో మేలు చేస్తుంది.

# విరుద్ధ ఆహారంతో చర్మ వ్యాధులు

పాలు సంపూర్ణ ఆహారం అని మనందరికీ తెలుసు. పెరిగే పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పాలు ఎంతో బలాన్ని ఇస్తాయి. అయితే, పాలు ఎంత పోషక విలువలు కలిగినవో, అంతే సెన్సిటివ్ కూడా. ఆయుర్వేదం ప్రకారం పాలను కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అవి మన జీర్ణవ్యవస్థపై వినాశకర ప్రభావాన్ని చూపుతాయి. శరీరంలో టాక్సిన్స్ (విషతుల్యాలు) పేరుకుపోవడానికి కారణమవుతాయి. పాలు తాగేటప్పుడు మనం చేసే చిన్న చిన్న తప్పులు ఎలాంటి అనారోగ్యాలకు దారితీస్తాయో తెలుసుకుందాం. ఆమె రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పాలు, పండ్లను కలిపి తీసుకుంటుంది. అతను జిమ్ ముగించుకుని గుడ్లు, పాలు కలిపి సేవిస్తాడు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివని వారు నమ్ముతుంటారు. కానీ, కొన్ని రోజుల తర్వాత వారిద్దరికీ చర్మంపై దద్దుర్లు, కడుపులో ఉబ్బరం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఖరీదైన మందులు వాడినా ఫలితం లేదు. ఎందుకో తెలుసా? వారు తీసుకుంటున్న ఆహారంలోనే అసలు శత్రువు దాగి ఉన్నాడు. పాలు ఒక అమృతం లాంటిదే కావచ్చు, కానీ కొన్ని వస్తువులతో కలిస్తే అది విషంగా మారుతుంది.



1. **పాలు సిట్రస్ పండ్లు (నిమ్మ, నారింజ):** నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ, పైనాపిల్ వంటి పండ్లు ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటాయి. పాలు చలవ చేసే గుణం కలిగి ఉండి జీర్ణం కావడానికి సమయం తీసుకుంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకున్నప్పుడు కడుపులో పాలు వెంటనే విరిగిపోతాయి. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ మరియు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాలు తాగిన గంట వరకు ఈ పండ్లను తీసుకోకపోవడమే మంచిది.
2. **చేపలు - పాలు:** మన పెద్దలు ఎప్పుడూ చెప్పే మాట.. చేపలు తిన్న తర్వాత పాలు తాగకూడదు. ఆయుర్వేదం ప్రకారం చేపలు వేడి చేసే గుణాన్ని, పాలు చలవ చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. ఈ రెండు విరుద్ధ స్వభావాలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో అసమతుల్యత ఏర్పడి దీర్ఘకాలంలో చర్మ అలర్జీలు, బొల్లి వంటి సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.
3. **పాలు- పుల్లని పదార్థాలు** (ఊరగాయలు, వెనిగర్): ఊరగాయలు, వెనిగర్ తో చేసిన వంటకాలు లేదా పుల్లటి పెరుగుతో చేసిన పదార్థాలను పక్కన పెట్టుకుని పాలు తాగడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. వీటిలోని ఆమ్లాలు పాలను గడ్డకట్టేలా చేస్తాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం కలగడమే కాకుండా, వికారం వచ్చే అవకాశం ఉంది.
4. **గుడ్లు- పాలు:** ప్రస్తుత డైట్ ప్లాన్లలో పాలు, గుడ్లు కలిపి తీసుకోవడం సాధారణమైపోయింది. కానీ సాంప్రదాయ విజ్ఞానం దీనిని అంగీకరించదు. పాలలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది, గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. ముఖ్యంగా ఉడకని లేదా పచ్చి గుడ్లను పాలతో కలిపి తీసుకుంటే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యం కోసం పాలు తాగడం మంచిదే, కానీ ఏది దేనితో కలపాలో తెలియకపోతే అది అనారోగ్యానికి దారితీస్తుంది. పైన పేర్కొన్న పదార్థాలకు, పాలకు మధ్య కనీసం గంట లేదా రెండు గంటల విరామం ఉండేలా చూసుకోండి. మీ జీర్ణక్రియను కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది.



# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా?

ఫ్యాటీ లివర్ ఇప్పుడు ఒక సాధారణ సమస్యగా మారింది. ఇది కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. కాలేయం సరిగ్గా పనిచేయకపోతే, మొత్తం ఆరోగ్యంపై నేరుగా ప్రభావం పడుతుంది. ఫ్యాటీ లివర్ కారణంగా కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది, శరీరంలో విషపదార్థాల (టాక్సిన్స్) స్థాయిలు పెరుగుతాయి. జీవక్రియలో అసమతుల్యత కలుగుతుంది. కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన, రెండవ అతిపెద్ద అవయవం. ఇది శరీరానికి 500 కంటే ఎక్కువ విధులను నిర్వహిస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన, చురుకైన కాలేయాన్ని ఉంచుకోవడం చాలా ముఖ్యం. కానీ, సరైన ఆహారం తీసుకోకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి వలన కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం (ఫ్యాటీ లివర్) సాధారణం. దీని వల్ల కాలేయ సామర్థ్యం తగ్గి, శరీరంలోని అనేక అవయవాల పనితీరు ప్రభావితమవుతుంది. అంతేకాదు, కొన్ని పండ్లను ఆహారంలో చేర్చడం వల్ల కాలేయంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఉపకరిస్తున్న కొన్ని పండ్లు..నారింజ, నిమ్మకాయ, బత్తాయి, కమలాఫలం వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ అ పుష్కలంగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. కాలేయాన్ని విష పదార్థాల నుంచి రక్షిస్తాయి. విటమిన్ అ కాలేయ నిర్విషీకరణలో సహాయపడుతుంది. కొవ్వు పేరుకుపోవడానికి అడ్డుగట్టుతుంది.ఆపిల్స్ లో కరిగే ఫైబర్ (పెక్టిన్) ఎక్కువగా ఉంటుంది. ఇది కాలేయంలో కొవ్వు తగ్గించడంలో, నిర్విషీకరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. రోజూ ఒక ఆపిల్ తినడం కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బొప్పాయిలో విటమిన్లు, ఎంజైములు పుష్కలంగా ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు మద్దతు ఇస్తాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి బొప్పాయి తినడం వల్ల కాలేయంపై భారాన్ని తగ్గించడంలో, పనితీరు మెరుగుపరచడంలో సహాయపడుతుంది.కివిలో విటమిన్లు, ఖనిజాల మిశ్రమం ఉంటుంది. ఇది కాలేయ ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని ప్రోత్సహిస్తుంది. అలాగే, కాలేయంపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. ముఖ్యమైన విషయం ఏంటంటే.. పండ్లను సక్రమంగా ఆహారంలో చేర్చడం, సమతుల్య ఆహారం, వ్యాయామం, తగిన నిద్ర, నీరు త్రాగడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నిరోధించవచ్చు. ఆరోగ్యకరమైన కాలేయాన్ని కొనసాగించవచ్చు.

# మేమున్నాం..!





20 నెలల కిందట భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచిన రోజే.. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. దీంతో ఒక్కసారిగా టీ20 జట్టు ఆకర్షణ కోల్పోయింది. ఈ ఇద్దరూ లేకుండా జట్టు ముందుకు వెళ్లగలదా? విజయాలు సాధించగలదా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. కానీ ఎక్కువగా కుర్రాళ్లతో నిండిన భారత టీ20 జట్టు పరీక్షకు నిలిచింది. వరుసబెట్టి సిరీస్‌లు గెలిచింది. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌నూ సాధించింది. భారత క్రికెట్లో తరగని ప్రతిభ ఉందనడానికి, కుర్రాళ్లు అసాధ్యులనడానికి ఈ విజయం రుజువు.

జట్టుకు ఎన్నో ఏళ్ల పాటు అండగా ఉన్న, అభిమానుల్లో ఎంతో ఆదరణ ఉన్న ఆటగాళ్లు ఒకేసారి నిష్క్రమిస్తే.. ఒక రకమైన శూన్యత ఏర్పడడం సహజం. ఆ సంధి దశను అధిగమించడం జట్టుకు కష్టమవుతుంది. అభిమానుల్లో కూడా జట్టుపై గురి కుదరదు. ఒకప్పుడు కుంబ్లే, గంగూలీ, ద్రవిడ్, లక్ష్మణ్, సచిన్, సెహ్వాగ్, యువరాజ్, గంభీర్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు జట్టును ఖాళీ చేస్తే టీమ్‌ఇండియా బాగా ఇబ్బంది పడింది. కొన్నేళ్ల పాటు ఈ సంధి దశ సాగింది. ధోని సారథ్యంలో జట్టు నెమ్మదిగా పుంజుకుంది. తర్వాత ధోని నిష్క్రమించాడు. కోహ్లి, రోహిత్ అందుకున్నారు. కానీ వీళ్లిద్దరూ ఒకేసారి రిటైరవడంతో టీ20 జట్టు కళ తప్పినట్లయింది. ఈ ఇద్దరూ నిరుడు టెస్టుల నుంచి కూడా నిష్క్రమించారు. అయితే సుదీర్ఘ ఫార్మాట్లో వీరి స్థానాలను భర్తీ చేయడం అంత తేలికైన విషయంలా కనిపించడం లేదు. పొట్టి క్రికెట్లో మాత్రం భారత్‌కు ప్రతిభకు లోటే లేదు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో మెరుపులు మెరిపించగల బ్యాటర్లకైతే లెక్కే లేదు. శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, జితేశ్ శర్మ, దేవ్‌దత్ పడిక్కల్, సాయి సుదర్శన్ లాంటి ఎంతోమంది ప్రతిభావంతులు పోటీలో ఉన్నా భారత జట్టులో చోటు దక్కని పరిస్థితి. ప్రపంచకప్ విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్ సైతం కొన్ని మ్యాచ్‌లకు తుది జట్టుకు దూరంగా ఉన్నాడు. రింకు సింగ్ అందుబాటులో లేని సమయంలో అతను అవకాశం దక్కించుకుని రాణించడంతో జట్టులో కొనసాగించాల్సి వచ్చింది. నిలకడగా రాణిస్తే తప్ప జట్టులో చోటు ఖాయం కాని పరిస్థితి. అదే సమయంలో దేశవాళీల్లో మెరుపులు మెరిపిస్తే.. ఎక్కువ కాలం ఏ ఆటగాడూ జట్టుకు దూరంగా ఉండాల్సిన అవసరమూ ఉండదు. రెండేళ్ల పాటు భారత జట్టు ఛాయల్లో లేని ఇషాన్ కిషన్.. ముస్తాక్ అలీలో అదరగొట్టి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అంతకంటే ముందు తిలక్ వర్మ కివీస్‌తో సిరీస్‌కు అందుబాటులో లేకపోవడంతో అతడికి తుది జట్టులో ఆడే అవకాశం దక్కింది. దీన్ని ఇషాన్ రెండు చేతులా అందిపుచ్చుకుని ప్రపంచకప్‌లోనూ మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ పట్టేశాడు. ఇక పాకిస్థాన్‌తో కీలక పోరులో, ఫైనల్లో అతను ఎంత విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడో తెలిసిందే. అభిషేక్ శర్మ ప్రపంచకప్‌లో చాలా వరకు అంచనాలు అందుకోలేకపోయాడు కానీ.. ఫైనల్లో కీలక ఇన్నింగ్స్‌తో తన విలువను చాటాడు. 2024 ప్రపంచకప్ తర్వాత భారత్ ఒక్క సిరీస్ కూడా ఓడిపోకపోవడంలో అభిషేక్ పాత్ర ఎంతో కీలకం. తిలక్ వర్మ సైతం ఇదే స్థాయిలో రాణించాడు. నిరుడు పాకిస్థాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో జట్టును గెలిపించింది అతనే. అంతకుముందు ఏడాది దక్షిణాఫ్రికాలో వరుసగా రెండు శతకాలతో జట్టుకు సిరీస్ అందించాడు. ప్రస్తుత ప్రపంచకప్‌లోనూ కొన్ని విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. శివమ్ దూబె గత టీ20 ప్రపంచకప్‌లోనే కాదు.. ఇప్పుడు కూడా కనిపించని హీరో. సీనియర్లయిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలే అనుకున్నంతగా రాణించలేకపోయారు. కానీ యువ ఆటగాళ్లు మాత్రం బ్యాటన్ అందుకుని జట్టును ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పుడున్న సీనియర్లు నిష్క్రమించినా.. టీమ్‌ఇండియాకు ఢోకా లేదనే భరోసాను యువ ఆటగాళ్లు ఇస్తున్నారు. ఆ స్థాయిలో భారత్‌లో పుష్కలమైన ప్రతిభ భారత్ సొంతం. వైభవ్ సూర్యవంశీ సహా ఎంతోమంది కుర్రాళ్లు భారత జట్టు వైపు దూసుకొస్తున్నారు. జూనియర్ కోచ్‌గా గతంలో ద్రవిడ్, ఇప్పుడు లక్ష్మణ్ సాయంతో యువ క్రికెటర్లను సానబెట్టే గొప్ప వ్యవస్థను బీసీసీఐ ఏర్పాటు చేసుకుంది. యూత్, ఇండియా-ఎ మ్యాచ్‌ల ద్వారా ఎంతోమంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తూనే ఉన్నారు. వీరిలో టెస్టు క్రికెట్ పరీక్షకు ఎంతమంది నిలవగలరన్నది ప్రశ్నార్థకమే కానీ.. పరిమిత ఓవర్ల క్రికెట్, ముఖ్యంగా టీ20ల వరకు ఢోకా లేదు.

అంతా బాగుంది కానీ..: ఐసీసీ టోర్నీలు గెలుస్తున్నాం. సిరీస్‌లు సాధిస్తున్నాం. బోలెడంతమంది యువ బ్యాటర్లు దూసుకొస్తున్నారు. అంతా బాగున్నా.. భారత బౌలింగ్ మాత్రం ఆందోళనకరంగానే ఉంది. ముఖ్యంగా ఈ ప్రపంచకప్‌లో బౌలర్ల ప్రదర్శన ఏమాత్రం ఆశాజనకంగా లేదు. జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే నిలకడగా రాణించాడు. సెమీస్‌లో 250 పైచిలుకు స్కోరు చేసినా.. భారత్ ఓటమి భయాన్ని ఎదుర్కొంది. బుమ్రా చివరి రెండు ఓవర్లు లేకుంటే.. ఆ మ్యాచ్‌తోనే టీమ్‌ఇండియా టోర్నీ నుంచి నిష్క్రమించేది. బుమ్రాకు 32 ఏళ్లు వచ్చేశాయి. అతను కొన్నేళ్లుగా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఒకట్రెండేళ్లకు మించి అతను ఆటలో కొనసాగకపోవచ్చు. మరి అతడి తర్వాత ఎవరన్నది ప్రశ్న? ప్రస్తుత జట్టులో బుమ్రా కాకుండా నమ్మదగ్గ బౌలర్ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ప్రపంచకప్‌లో అర్ష్‌దీప్ భరోసానివ్వలేకపోయాడు. సిరాజ్‌కు టోర్నీలో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఆడిన మ్యాచ్‌లో రాణించాడు. కానీ టీ20ల్లో అతడి రికార్డు అంతంతమాత్రం. సిరాజ్ జట్టులోకి వచ్చింది గాయపడ్డ హర్షిత్ రాణా స్థానంలో. అయితే హర్షిత్ కానీ, ప్రపంచకప్ ముందు కొన్ని సిరీస్‌లు ఆడిన ప్రసిద్ధ్ కృష్ణ కానీ నిలకడగా రాణించలేకపోయారు. పరుగులివ్వడంలో ఇద్దరూ పోటాపోటీయే. చాలా ఏళ్లు జట్టుకు అండగా ఉన్న సీనియర్ పేసర్ మహ్మద్ షమికి వయసు మళ్లిందని, ఫిట్‌నెస్ తగ్గిందని పక్కన పెట్టేసింది జట్టు యాజమాన్యం. కానీ ప్రపంచకప్ సరైన ప్రత్యామ్నాయాలు లేని స్థితిలో అతణ్ని ఆడిస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జమ్మూకశ్మీర్ యువ సంచలనం ఆకిబ్ నబి లాంటి వాళ్ల వైపు చూడాల్సిన అవరం కనిపిస్తోంది. స్పిన్ విషయానికి వస్తే ఇన్నాళ్లూ నిలకడగా రాణించిన వరుణ్ చక్రవర్తి ప్రపంచకప్‌లో నిరాశపరిచాడు. కుల్‌దీప్‌కు చాలినన్ని అవకాశాలు రాలేదు. ఇటు పేస్‌లో, అటు స్పిన్‌లో బెంచ్ బలాన్ని పెంచాల్సిన అవసరాన్ని ఈ ప్రపంచకప్ చాటిచెప్పింది.

# భారత్ 2.. స్కాట్లాండ్ 2

హైదరాబాద్



మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో సోమవారం స్కాట్లాండ్‌తో మ్యాచ్ (పూల్-బి)ను భారత్ 2-2తో డ్రాగా ముగించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (18వ), సునెలిటా తొపో (29వ) చెరో గోల్ కొట్టారు. స్కాట్లాండ్ జట్టులో హెథర్ మెక్‌ఎవాన్ (6వ), ఫియోనా బర్నెట్ (33వ) స్కోర్ చేశారు. చెరో రెండు గోల్స్ కొట్టాక.. జట్లు ఆధిక్యం కోసం గట్టిగా ప్రయత్నించాయి. అవకాశాలు సృష్టించుకున్నా.. స్కోర్ చేయలేకపోయాయి. ఆఖరి క్వార్టర్‌లో భారత్ అనేక పెనాల్టీ కార్నర్‌లు సాధించినా, సద్వినియోగం చేసుకోలేకపోయింది. భారత జట్టు నాలుగు పాయింట్లతో పూల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో 4-0తో ఉరుగ్వేను చిత్తు చేసిన భారత్.. తర్వాతి మ్యాచ్‌లో బుధవారం వేల్స్‌ను ఢీకొంటుంది. సోమవారం మరో పూల్-బి మ్యాచ్‌లో ఉరుగ్వే 3-2తో వేల్స్‌ను ఓడించింది. పూల్-ఎలో ఇంగ్లాండ్ 3-0తో కొరియాపై, ఇటలీ 3-0తో ఆస్ట్రియాపై నెగ్గాయి. భారత్, స్కాట్లాండ్ మధ్య మ్యాచ్‌కు స్టార్ షట్లర్ పి.వి. సింధు ప్రత్యేక అతిథిగా హాజరైంది.

## భారత్ కప్పు గెలిచింది.. మరి కెప్టెన్ సూర్య పయనమెటు?

ముంబయి

20 నెలల ముందు రోహిత్ శర్మ నుంచి భారత టీ20 జట్టు పగ్గాలందుకున్న సూర్యకుమార్ యాదవ్.. సారథిగా ఒక్కటంటే ఒక్క సిరీస్, టోర్నీలోనూ ఓడిపోకపోవడం విశేషం. అతడి నాయకత్వంలో ప్రతి సిరీస్‌లోనూ గెలిచింది టీమ్‌ఇండియా. నిరుడు ఆసియా కప్, ఇప్పుడు ప్రపంచకప్‌నూ సొంతం చేసుకుంది. అయితే సూర్య సారథ్యంలో జట్టు గొప్ప ప్రదర్శనే చేసినా.. అతడి వ్యక్తిగత ప్రదర్శన మాత్రం పడిపోయింది. మధ్యలో అతణ్ని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్లు కూడా వినిపించాయి. ప్రపంచకప్‌లో జట్టు గెలిచినా, గెలవకపోయినా అతడికిదే చివరి టోర్నీ కావచ్చనే చర్చ జరిగింది. అయితే జట్టు కప్పు గెలిచింది. ఆటగాడిగా సూర్య పాత్ర తక్కువే అయినా.. కెప్టెన్‌గా ఆకట్టుకున్నాడు. అయితే కప్పు నెగ్గిన అనంతరం రిటైర్మెంట్ గురించి ప్రస్తావిస్తే.. ఇప్పుడు అంతా బాగానే ఉంది కదా, దాని గురించి ఆలోచన ఎందుకు అన్నాడు సూర్య. ఇక కోచ్ గంభీర్‌తో కలిసి పాల్గొన్న విలేకరుల సమావేశంలో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2028 ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలవడం, అదే ఏడాది టీ20 ప్రపంచకప్‌ను సాధించడం భవిష్యత్ లక్ష్యాలని పేర్కొన్నాడు. ఇవి జట్టు లక్ష్యాలుగా చెప్పాడా.. లేక తనకు ఆపాదించుకున్నాడా అన్నది ప్రశ్న. సూర్యనే ఆ లక్ష్యాలు పెట్టుకుని ఉన్నట్లయితే 35 ఏళ్లు పైబడి, ఫామ్‌తో తంటాలు పడుతున్న అతను.. ఇంకో రెండేళ్లు కెప్టెన్‌గా, ఆటగాడిగా కొనసాగగలడా.. టీమ్‌ఇండియాలో చోటు కోసం వేచివున్న ప్రతిభావంతుల తాకిడిని తట్టుకుని అతడు అప్పటివరకు నిలవగలడా అన్నదే సందేహం.

గంభీర్‌తో అలా కుదిరింది... సూర్య: ఒకప్పుడు రోహిత్‌శర్మ – రాహుల్ ద్రవిడ్ మాదిరే.. గౌతమ్ గంభీర్‌కు తనకు మధ్య పరస్పర అవగాహన, గౌరవం ఉన్నాయని భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. "కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో ఉన్నప్పుడు నాలుగేళ్లు గౌతమ్ గంభీర్‌తో కలిసి పని చేశాను. అతడెలా ఆలోచిస్తాడో నాకు తెలుసు. భారత కెప్టెన్‌గా నేను, కోచ్‌గా గంభీర్ బాధ్యతలు స్వీకరించాక అతడో రెండు అడుగులు వేస్తే.. నేను రెండు అడుగులు వేసేవాడిని. ఇద్దరికి అలా సమన్వయం కుదిరింది. ఎందుకంటే మేమిద్దరం అప్పటికి ఒకే స్థితిలో ఉన్నాం. శ్రీలంక సిరీస్‌తో మేం పయనం మొదలుపెట్టాం. జట్టు విజయమే లక్ష్యంగా పని చేశాం. ఏ ఆటగాడిని తీసుకుంటే టీమ్ లాభపడుతుందనే విషయాన్నే ఆలోచించేవాళ్లం. తుది జట్టు గురించి ఇద్దరం చర్చించేవాళ్లం. జట్టు గెలుస్తుంటే ఎక్కువ మాట్లాడేవాళ్లం కాదు. డ్రెస్సింగ్ రూమ్‌లో భావాలను స్వేచ్ఛగా వెల్లడించే వాతావరణం కల్పించాం. ఒడుదొడుకులు వస్తూ ఉంటాయని.. ప్రతిసారీ స్కోరు చేయడం, వికెట్లు తీయడం సాధ్యం కాకపోవచ్చని ప్లేయర్లకు చెప్పి ప్రోత్సహించేవాళ్లం" అని సూర్య తెలిపాడు.

# భారత్ శకం అనలేం

అహ్మదాబాద్



టీ20 ప్రపంచకప్ నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమ్‌ఇండియా రికార్డు సృష్టించింది. అంటే దీనర్థం పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత్ శకం నడుస్తోందని అనుకోవచ్చా అంటే.. కోచ్ గంభీర్ కాదంటున్నాడు. ఆధిపత్యమే నిజమైతే గత మూడు వన్డే సిరీస్‌ల్లో రెండు కోల్పోయే వాళ్లం కాదని అన్నాడు. వరుసగా మూడు సంవత్సరాల్లో మూడు (2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్) ఐసీసీ ట్రోఫీలను గెలిచిన నేపథ్యంలో సహజంగానే కొందరు పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత్ ఆధిపత్యాన్ని.. 1999, 2007 మధ్య ఆస్ట్రేలియా ఆధిపత్యంలో పోలుస్తున్నారు. అప్పుడు కంగారూ జట్టు వరసగా మూడు వన్డే ప్రపంచకప్‌లు నెగ్గింది. ఈ ఆధిపత్యం గురించి ప్రశ్నించినప్పుడు గంభీర్ స్పందిస్తూ.. "నేను వైట్‌బాల్ క్రికెట్ గురించి మాట్లాడను. వన్డే ఫార్మాట్లో గత మూడు సిరీస్‌ల్లో రెండు ఓడిపోయాం. ఇది టీమ్‌ఇండియా శకమైతే.. రెండు సిరీస్‌లు ఓడిపోయేది కాదు" అని అన్నాడు. "ఈ శకాల గురించి నేను పట్టించుకోను. దేశం తరఫున ఆడుతున్నప్పుడు ప్రతి మ్యాచూ గెలవాలనుకుంటాం. ప్రపంచకప్పైనా, ద్వైపాక్షిక సిరీస్ అయినా తేడా ఉండదు. అంతా ఒక్కటే" అని ప్రపంచకప్ ఫైనల్ అనంతరం గంభీర్ వ్యాఖ్యానించాడు.

నేనున్నంత వరకు..: తాను కోచ్‌గా ఉన్నంతవరకు ఆటగాళ్ల వ్యక్తిగత మైలురాళ్లకు సంబరపడడం ఉండదని గంభీర్ అన్నాడు. "నేను వాటిని పట్టించుకోను. ట్రోఫీలు ముఖ్యం. భారత క్రికెట్లో చాలా ఏళ్లు మైలురాళ్ల గురించి సంబరపడ్డాం. నేను కోచ్‌గా ఉన్నంతవరకు మేం వాటి గురించి మాట్లాడమని ఆశిస్తున్నా" అని చెప్పాడు. మైలురాళ్లకు కాకుండా ట్రోఫీ గెలిచినందుకే సంబరాలు చేయాలని మీడియాను గంభీర్ కోరాడు. ఈ విషయంలో తనది, కెప్టెన్ సూర్యది ఒకే అభిప్రాయం కావడం అదృష్టమని చెప్పాడు. సోషల్ మీడియా విమర్శలను తాను పట్టించుకోనని తెలిపాడు.

ఈ కప్పు రాహుల్, వీవీఎస్‌కు అంకితం: టీ20 ప్రపంచకప్‌ను తనకన్నా ముందు కోచ్ రాహుల్ ద్రవిడ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్‌లకు గంభీర్ అంకితమిచ్చాడు. "ఈ ట్రోఫీని నేను ముందు రాహుల్ (ద్రవిడ్) బాయ్, ఆ తర్వాత లక్ష్మణ్‌కు అంకితమివ్వాలి. రాహుల్ భాయ్ భారత క్రికెట్‌ను మంచి స్థితిలో నిలిపాడు. తన హయాంలో ఎంతో చేశాడు. అందుకు అతడికి కృతజ్ఞతలు. లక్ష్మణ్ భారత క్రికెట్‌కు తెరవెనక నుంచి ఎంతో చేస్తున్నాడు. భారత క్రికెట్‌కు సీఓఈ ఎంతో మంది క్రికెటర్లను అందిస్తోంది" అని అన్నాడు. 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు ద్రవిడ్ కోచ్.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం
10 మార్చి 2026



# అమ్మే అసలైన స్ఫూర్తి!

బాల్యం నుంచీ అన్ని రకాలుగా అండగా నిలిచిన తన తల్లే.. తనకు స్ఫూర్తి అని చెబుతున్నది రకుల్‌ప్రీత్ సింగ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాజాగా, ఓ జాతీయ మీడియాతో మాట్లాడింది. జీవితంలో తనకు ప్రేరణగా నిలిచిన మహిళల గురించి ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. నేటితరం మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారనీ, ప్రతిరంగంలోనూ బలమైన ప్రభావాన్ని చూపుతున్నారనీ పేర్కొన్నది. “మన చుట్టూ ఉన్న మహిళలను అభినందించడం, వారి విజయాలను గుర్తించడం, వారి కలలకు మద్దతుతోపాటు బలాన్ని కూడా అందివ్వడమే.. మహిళా దినోత్సవ ఉద్దేశం” అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నది. ఇక స్ఫూర్తిదాయకమైన మహిళలతో సమయం గడపడమే తనకు అత్యంత ఇష్టమైన వ్యాపకాల్లో ఒకటని వెల్లడించింది. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. తన తల్లే తనకు ప్రేరణ అని చెప్పుకొచ్చింది. “మా అమ్మే నాకు స్ఫూర్తి. నా బలం. ఆమే నాకు అతిపెద్ద ప్రేరణ. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సానుకూలంగా ఉండటాన్ని మాకు బాల్యం నుంచే నేర్పించింది” అంటూ తల్లి గురించి తెలియజేసింది. ఆమెవల్లే ఈరోజు తాను ఈస్థితిలో ఉన్నాననీ వెల్లడించింది. “మా అమ్మ చిన్నప్పటి నుంచే నాకు కష్టపడి పనిచేయడం, నన్ను నేను నమ్ముకోవడం నేర్పింది. ఎల్లప్పుడూ నాపై ఎంతో నమ్మకం ఉంచేది. నేను కూడా ఆమె నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నా! ఇక మా అమ్మ ప్రతి బాధ్యతనూ ఎంతో దయతో నిర్వహించేది. అందుకే.. ఎన్నో విషయాల్లో నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది” అంటూ చెప్పుకొచ్చింది.




# ‘ద్రోణ’లో బికినీ అందుకే వేశాను

చాలా సంవత్సరాల క్రితం ప్రియమణి, నితిన్ హీరోగా రూపొందిన ద్రోణ అనే చిత్రంలో హీరోయిన్గా నటించింది. ఈ సినిమా సమయంలో టాలీవుడ్ ఇండస్ట్రీలోని హీరోయిన్లు పెద్దగా బికినీ సన్నివేశాలు చేసేవారు కాదు.అలాంటి సమయంలో ద్రోణ చిత్రంలో ప్రియమణి బికినీ వేసుకుంది. దానితో ఆ టైంలో ఈ విషయం చాలా పెద్ద న్యూస్ అయింది. అలాగే ప్రియమణికి కూడా ఈ సినిమా ద్వారా మంచి గుర్తింపు వచ్చింది. తాజాగా ఈ బ్యూటీ వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన సరస్వతీ చిత్రంలో కీలకమైన పాత్రలో నటించింది.ఈ సినిమా ఈరోజు విడుదలైంది. ఈ సినిమా విడుదల సందర్భంగా వరలక్ష్మి శరత్ కుమార్ తో పాటు ప్రియమణి కూడా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో భాగంగా ద్రోణ సినిమాలో బికినీ వేయడం గురించి ఆమె ఓపెన్ అయింది. తాజాగా ప్రియమణి మాట్లాడుతూ... “చాలా సంవత్సరాల క్రితం నేను ద్రోణ సినిమాలో స్విమ్ సూట్ వేశాను. కామన్ గా మనం స్విమ్ చేయడానికి వెళ్లేటప్పుడు చీర కట్టుకొని వెళ్లలేము, స్విమ్ సూట్ వేసుకొని వెళ్ళాలి. ఆ సినిమా సమయంలో దర్శకుడు మీరు స్విమ్ సూట్ వేసుకుంటారా అని అడిగారు, నాకు ఇందులో పెద్దగా ఏముంది వేసేద్దాం అని అనుకున్నాను, అలాగే చేశాను. మనం ఫారన్ కంట్రీస్ కి వెళ్ళినప్పుడు అక్కడ ఎంతోమంది స్విమ్ సూట్ వేసుకొని ఉంటారు, నాకు సినిమాలో కూడా స్విమ్ సూట్ వేసుకోవడం అలాగే అనిపించింది” అని ఈమె చెప్పుకొచ్చింది. ఇకపోతే ప్రస్తుతం ప్రియమణి చేతిలో చాలా సినిమాలు ఉన్నాయి. చిరంజీవి, బాబి కాంబోలో తెరకెక్కబోయే సినిమాలో కూడా ప్రియమణి హీరోయిన్గా కనిపించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.



# ‘మంత్ర’లో చార్మి 15 నిమిషాలే ఉంటుంది

ప్రముఖ నటుడు శివాజీ తాజాగా సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటించడమే కాకుండా ఈ సినిమాను నిర్మించాడు. ఇందులో లయ హీరోయిన్గా నటించింది. ఈ సినిమా ఈరోజు అనగా మార్చి 6వ తేదీన థియేటర్లలో విడుదలైంది. మొదటగా ఈ సినిమాను నేరుగా ఓటీటీలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఈ సినిమాను ఓటీటీలో కాకుండా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ సినిమా విడుదల సందర్భంగా శివాజీ వరుసగా అనేక ఇంటర్వ్యూలలో పాల్గొంటూ వస్తున్నాడు. అందులో భాగంగా తనకు సంబంధించిన అనేక విషయాలను కూడా ఈయన తెలియజేస్తున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో భాగంగా మీరు చాలా సంవత్సరాల క్రితం చార్మి ప్రధాన పాత్రలో రూపొందిన ‘మంత్ర’లో నటించారు కదా? అనే ప్రశ్న ఎదురయింది. దానికి ఆయన చార్మి ప్రధాన పాత్రలో నటించిన సినిమా కాదు, అది నా సినిమా. అందులో చార్మి పాత్ర కేవలం 15 నుండి 20 నిమిషాలు మాత్రమే ఉంటుంది. సినిమాలో మొత్తం నేనే కనబడతాను. ఆ సినిమా విడుదలకు ముందు ఆ మూవీ యూనిట్ వారు నా పాత్రను పెద్దగా ఫోకస్ కాకుండా చూడాలనుకున్నారు, అది సక్సెస్ అయ్యింది. ఇక మంత్ర సినిమాతోనే తెలుగు సినీ పరిశ్రమలో హర్రర్ ప్లస్ కామెడీని మిక్స్ చేశారు. ఆ సినిమా కంటే ముందు ఆ జోనర్ లో తెలుగులో ఒక్క సినిమా కూడా రాలేదు. అప్పట్లో మంత్ర చిత్రం అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది అని శివాజీ తాజాగా చెప్పుకొచ్చాడు.



# ఆ పాత్ర మిస్సయ్యాను

నటనలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న యాక్టర్ లయ. సినిమాలకు టాటా చెప్పి అమెరికాలో స్థిరపడింది. ఇటీవలే మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది. నటుడు శివాజీతో కలిసి.. ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’ అంటూ ఫ్యామిలీ థ్రిల్లర్‌తో థియేటర్లలో సందడి చేస్తున్నది. ఈ సందర్భంగా లయ పంచుకున్న కబుర్లు ఇవి.. నా కూతురు శ్లోకాకు నాలాగే యాక్టింగ్ అంటే ఇష్టం. గతంలో రవితేజ నటించిన ‘అమర్ అక్బర్ ఆంటోని’ సినిమాలో ఇలియానా చిన్నప్పటి పాత్రలో నటించింది. సినిమాల్లో రాణించాలనే ఆలోచనతో ఉన్నది. అవకాశం వస్తే తనూ మీ ముందుకు వస్తుంది. ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’ సినిమాలో పాయ అంటూ సాగే పాట విని ఆశ్చర్యానికి గురయ్యాను. నిజంగా నాకు ఆ సమయంలో పాయ అంటే తెలియదు. ‘ఆ మాత్రం కూడా తెలియదా!’ అని మీరు అనుకోవచ్చు కానీ నాకు నిజంగా తెలీదండి. ఆ తరువాత తెలుసుకున్నా.. పాయ అంటే ఓ నాన్‌వెజ్ వంటకం అని. అరవింద సమేత సినిమాలో జగపతిబాబు భార్య పాత్ర చేయమని ఆఫరొస్తే అది మరీ చిన్నరోల్ అని భావించి తిరస్కరించాను. సినిమా విడుదలయ్యాక తెలిసింది నేను చేసిన తప్పేమిటో? చాలా పవర్‌ఫుల్ రోల్ మిస్స్ అయ్యాను అని బాధపడ్డాను. పూర్తి కథ వినకుండానే ఆ పాత్రను వదులుకున్నందుకు పశ్చాత్తాపడ్డాను. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల సూపర్‌హిట్ సినిమాల్లో అవకాశాలు కోల్పోయాను. ఒకసారి హైదరాబాద్‌లో విహారయాత్రకు వెళ్లినప్పుడు అక్కినేని కుటుంబరావు టీమ్ నన్ను చూశారు. వాళ్లు తీయబోయే ‘భద్రం కొడుకో’ సినిమాలో బాలనటిగా చేయమని అడిగారు. నేనూ ఇష్టంతో నటించా. ఆ తరువాత రాఘవేంద్రరావు నిర్వహించిన జెమినీ టీవీ స్టార్ 2000 కంటెస్ట్ ద్వారా ఇండస్ట్రీలోకి వచ్చా. ఆ పోటీలో శివాజీ కూడా పాల్గొన్నారు. అప్పటినుంచే మా ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. శివాజీతో కలిసి ‘మిస్సమ్మ, అదిరిందయ్యా చంద్రం, టాటా బిర్లా మధ్యలో లైలా’ సినిమాల్లో చేశాను. ఆయనతో పనిచేయడం ఎంతో ఈజీ. నటనకు స్వేచ్ఛనిచ్చే తెలుగు హీరోల్లో బాలకృష్ణగారి రూటే సపరేట్. ఆయనతో కలిసి నటించిన విజయేంద్ర వర్మ సినిమా ఎంతో ప్రత్యేకం.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.